RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY తెలుగు దినపత్రిక

మల్కాజిగిరి MALKAJGIRI | సంపుటి : 3 VOLUME : 3 | సంచిక : 65 ISSUE NO : 65 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ EDITOR : MERUGU CHANDRAMOHAN | మంగళవారం,ఆగస్టు,26,2025 Tuesday, August, 26 , 2025 | పేజీలు : 8 వెల : రూ.4/- PAGES : 8 RS : 4 /-



భారత్ అమెరికా రాయబారిగా

## సెర్గియో గోర్

**భారత్‌తో గిల్లి కజ్జాలు కోరుకుంటున్న ట్రంప్**

న్యూఢిల్లీ, : భారత్‌తో గిల్లి కజ్జాలనే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కోరుకుంటున్నారు. సుంకాల పెంపు, వీసాలపై కఠిన నిబంధలను ఇలా ఒక్కో చర్య ట్రంప్ భారత వ్యతిరే కతను చాటాయి. తాజాగా మరో దుందుడుకు చర్యకు పూనుకున్నారు. ఈ క్రమం లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయాలు భారత్-అమెరికా సంబంధాలను తీవ్రస్థాయిలో దెబ్బతీస్తున్నాయి. తాజాగా అత్యంత వివాదాస్పదమైన వ్యక్తుల్లో ఒకరైన సెర్గియో గోర్‌ను భారత్ అమెరికా రాయబారిగా, దక్షిణ, మధ్య ఆసియాలో పర్యవేక్షకుడిగా నియమించడం దౌత్యవర్గాలను షాక్‌కు గురిచేసింది.



స్వదేశీ ఉద్యమానికి

యువతే నాయకత్వం

## వహించాలి

- అహ్మదాబాద్‌లో సర్దార్‌ధామ్ బాలికల హాస్టల్‌కు వీడియో సందేశం ద్వారా శంకుస్థాపన
- స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలని ప్రజలకు, యువతకు ప్రధాని మోదీ పిలుపు
- 'ఇక్కడ స్వదేశీ వస్తువులే అమ్ముతాం' అని బోర్డులు పెట్టాలని దుకాణదారులకు సూచన
- మహిళా సాధికారతకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్న ప్రధాని మోదీ
- నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పనకు పెద్దపీట వేస్తున్నామని వెల్లడి...

ఢిల్లీ,: దేశ స్వావలంబనకు స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించడమే కీలకమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఇది వందేళ్ల నాటి పాత నినాదం కాదని, దేశ భవిష్యత్తును బలోపేతం చేసే ఆధునిక ప్రచారమని ఆయన స్పష్టం చేశారు. ఈ నూతన స్వదేశీ ఉద్యమానికి సమాజం, ముఖ్యంగా యువత నాయకత్వం వహించాలని ఆయన పిలుపునిచ్చారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో సర్దార్‌ధామ్ ఫేజ్-2 కన్యా ఛాత్రాలయ (బాలికల వసతి గృహం) శంకుస్థాపన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆదివారం ఆయన వీడియో సందేశం ద్వారా ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ, ప్రతి దుకాణదారుడు తమ వద్ద "కేవలం స్వదేశీ ఉత్పత్తులు మాత్రమే అమ్ముతాం" అనే బోర్డును ప్రదర్శించాలని సూచించారు. కుటుంబాలు కూడా దేశీయంగా తయారైన వస్తువులనే కొనుగోలు చేయాలని కోరారు. మంచి ఉద్దేశంతో పవిత్రమైన లక్ష్యంతో సమాజ శ్రేయస్సు కోసం కృషి చేస్తే దైవబలం కూడా తోడవుతుందని ఆయన పేర్కొన్నారు. మహిళా సాధికారత దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని ప్రధాని నొక్కిచెప్పారు.



మెరికాకు పోస్టల్ సేవలను

నిలిపివేసిన

## న్యూజిలాండ్

విల్లింగ్టన్ : అమెరికాకు పోస్టల్ సేవలను నిలిపివేసినట్లు న్యూజిలాండ్ పోస్టల్ సర్వీస్ తెలిపింది. న్యూజిలాండ్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన 15శాతం టారిఫ్‌లు ఈనెల 29 నుండి అమల్లోకి రానున్న సంగతి తెలిసిందే. దీంతో ఆగస్ట్ 21 నుండి పోస్టల్ సేవలను తాత్కాలికంగా నిలిపివేసినట్లు న్యూజిలాండ్ పోస్ట్ తెలిపింది. పరిమితమైన లేఖలు మరియు ముఖ్యమైన పత్రాలు, పాస్‌పోర్ట్‌లు లేదా చట్టపరమైన లేఖలు వంటివి మాత్రమే అమెరికాకు పంపబడతాయని క్యారియర్ వెబ్‌సైట్‌లోని ఒక ప్రకటన పేర్కొంది. తమ సేవల్లో మార్పులు చేయడానికి యత్నిస్తున్నామని, సాధ్యమైనంత త్వరగా డెలివరీలను తిరిగి ప్రారంభించాలని ఆశిస్తున్నట్లు వెల్లడించింది.



దర్యాప్తునకు

## సహకరించండి

**ప్రభాకర్రావుకు సుప్రీం ఆదేశం**

న్యూఢిల్లీ, : ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ ఐపీఎస్ అధికారి ప్రభాకర్ రావు బెయిల్ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో మరోసారి విచారణ జరిగింది. వాదనలు విన్న ధర్మాసనం తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. దర్యాప్తునకు సహకరించాలని ప్రభాకర్‌రావును ఆదేశించింది. ప్రభాకర్ రావు దర్యాప్తునకు ఏమాత్రం సహకరించడం లేదని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. కేసు దర్యాప్తునకు సంబంధించిన స్టేటస్ రిపోర్ట్ దాఖలు చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం తరపు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా, సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు తెలిపారు.



- తెలంగాణ, ఉస్మానియా రెండూ అవిభక్త కవలలు
- తెలంగాణ పదానికి ప్రత్యామ్నాయం ఉస్మానియా
- మహామహులంతా ఇక్కడి నుంచి ఉద్భవించిన వారే
- ఓయూకు పూర్వ వైభం తీసుకొచ్చేలా ప్రతిపాదనలు
- నిధులు ఇచ్చి అభివృద్ధి చేసేందుకు వెనకాడం
- నరిసించే వారికి సమాధానం చెప్పేందుకు సిద్ధం
- యూనివర్సిటీ అభివృద్ధి అధ్యయనానికి ఇంజనీర్స్ కమిటీ
- ఓయూలో వసతి గృహాలను ప్రారంభించిన సిఎం రేవంత్

ఉస్మానియాను స్టాన్‌ఫోర్డ్, ఆక్స్‌ఫర్డ్‌లా

## అభివృద్ధి చేద్దాం

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** తెలంగాణ పదానికి ప్రత్యామ్నాయం ఉస్మానియా యూని వర్సిటీ అని, తెలంగాణ, ఉస్మాని యా రెండూ అవిభక్త కవలల్లాంటివని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. చదువుతోపాటు పోరాటాన్ని నేర్పించే గడ్డ ఉస్మానియా యూనివర్సిటీ అన్నారు.. రాజకీయ నాయకులు తమ ప్రయోజనాల కోసం చేతులెత్తేసినప్పుడు.. తెలంగాణ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లింది కూడా ఉస్మానియా యూనివర్సిటీ అన్నారు. ఉస్మానియా వర్సిటీలో రూ.90 కోట్లతో నిర్మించిన భవనాలను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. దుందుభి, భీమా వసతి భవనాలను ప్రారంభించిన అనంతరం.. డిజిటల్ లైబ్రరీ, రీడింగ్ రూమ్‌లకు శంకుస్థాపన చేశారు.

ఈ కార్యక్ర మంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్, వేం నరేందర్‌రెడ్డి, కోదండరామ్, ఓయూ వీసీ కుమార్ తదితరులు పాల్గొన్నారు. సోమవారం ఉస్మానియా యూనివ ర్సిటీని సందర్శించిన సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ..

కొందరు వ్యక్తులు.. ఉస్మానియా యూనివర్సిటీని కాలగర్భంలో కలపాలని చూశారని మండిపడ్డారు. కానీ ఓయూకు పూర్వ వైభవం తీసుకురావాలని తాము నిర్ణయం తీసుకున్నామని వివరించారు. ఆ క్రమంలో 108 ఏళ్ల చరిత్ర కలిగిన వర్సిటీకి దళితుడిని వీసీ చేసి చూపించామన్నారు.



## కవిత దారెటు..?

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** కీయాలు ఒకే విధంగా ఉండవు. ఒకే విధంగా ఉంటే వాటిని రాజకీయాలు వారు. సరిగ్గా ఇదే సమ యానికి ఏడాది క్రితం కల్వకుంట్ల కవి త, కల్వకుంట్ల తారకరామారావు ఒక మాటగా, ఒక గొంతుకగా ఉండేవా రు. కల్వకుంట్ల కవితను ఢిల్లీలో జైల్లో నుంచి బయటకు తీసుకురావడానికి కల్వకుంట్ల తారకరామారావు విశ్వ ప్రయత్నాలు చేశారు. రోజుల తరబడి హస్తినలో తిష్ట వేశారు. చివరికి కల్వ కుంట్ల కవితను బయటికి తీసుకొచ్చా రు. జైలు నుంచి బయటికి రాగానే కవిత తన సోదరుడికి రాఖీ కట్టారు. తమ ఇద్దరి మధ్య అనుబంధాన్ని చాటుకున్నారు. ఏమైందో తెలియదు.. ఏం జరిగిందో తెలియదు.. ఇద్దరి మధ్య విభేదాలు పెరిగిపోయాయి. అవి ఊహించని స్థాయికి చేరుకున్నా యి. వాస్తవానికి ఇటువంటి మనస ర్థ లు గతంలో ఎన్నడు కూడా వారిద్దరి మధ్య రాలేదు. వచ్చే అవకాశాన్ని కూడా వారి తండ్రి కల్పించలేదు. కానీ ఇప్పుడు ఇద్దరి మధ్య ఆగాధం మరింత పెరిగిపోయింది. అది పూడ్చ లేని స్థాయికి చేరుకుంది. కల్వకుంట్ల కవితకు ఒకప్పుడు గులాబీ పార్టీ అనుకూల మీడియా విపరీతమైన ప్రాధాన్య మిచ్చేది. బీభత్సమైన స్పేస్ కల్పించేది. అప్పట్లో కేంద్ర దర్యాప్తు బృందం కవితను అరెస్ట్ చేసినప్పుడు గులాబీ మీడియా పతాక స్థాయి శీర్షికలతో వార్తలను ప్రచురించింది..



ప్రొ. కోదండరామ్‌ను మళ్లీ

## ఎమ్మెల్సీ చేస్తాం

**- ఓయూ పర్యటనలో రేవంత్ ఫైర్**

హైదరాబాద్,తెలంగాణ దిశ : ప్రొఫెసర్ కోదండరామ్‌ను మరో 15 రోజుల్లో మళ్లీ ఎమ్మెల్సీని చేసి శాసన మండలికి పంపిస్తానని సీఎం రేవంత్ రెడ్డి సంచలన ప్రకటన చేశారు. తమ ప్రభుత్వం ప్రొఫెసర్ కోదండరామ్‌ను ఎమ్మెల్సీగా చేసిందని గుర్తు చేశారు. కానీ బీఆర్ఎస్ నేతలు.. సుప్రీంకోర్టు వరకు వెళ్లి ఆయన పదవిని తీయించేశారని విమర్శించారు. ప్రొ. కోదండరామ్ ఎమ్మెల్సీ పదవిని ఊడకొట్టేందుకు రూ. కోట్లు ఖర్చు చేశారంటూ బీఆర్ఎస్ నేతలపై నిప్పులు చెరిగారు.

గత పదేళ్లలో యూనివర్సిటీని భ్రష్టు పట్టించారని మండిపడ్డారు. అయినా.. ఎందుకు అంత శునకానందం మీకు అంటూ.. బీఆర్ఎస్ పార్టీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ నాయకులు తమ ప్రయోజనాల కోసం చేతులెత్తేసినప్పుడు.. తెలంగాణ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లింది..



ఉద్యోగాల పేరుతో

## కాంగ్రెస్ మోసం

**సిఎం ఓయూ పర్యటనపై హరీశ్రావు విమర్శలు**

హైదరాబాద్,తెలంగాణ దిశ : సీఎం రేవంత్ రెడ్డి ఉస్మానియా యూనివర్సిటీ- పర్యటన నేపథ్యంలో విద్యార్థులను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. అరెస్టు చేసిన విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ సమాజంపై నిషేధాజ్ఞలు విధిస్తారా అని ప్రశ్నించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలన్నారు. ఒక్క విద్యార్థులే కాదు, యావత్ తెలంగాణ మీరు ఇచ్చిన మోసపూరిత హామీల గురించి నిలదీస్తున్నదని చెప్పారు.

# పిడిఎస్ యు ఆధ్వర్యంలో విద్యార్థి పోరుబాట యాత్ర ప్రారంభం

- రెండేళ్లుగా కమిషన్ల పేరుతో విద్యారంగం నిర్లక్ష్యం
- అబద్దాల పునాదులపై రేవంత్ పాలన
- విద్యార్థులకు చెల్లించాల్సిన స్కాలర్ షిప్స్, ఫీజు రీయింబర్స్ మెంట్ కు మొండి చెయ్యి
- రాష్ట్ర అధ్యక్షులు కాంపాటి పృథ్వీ







**భద్రాచలం, ఆగస్టు 25, (తెలంగాణ దిశ) :** తెలంగాణ రాష్ట్రంలో సంక్షోభంలో ఉన్న ప్రభుత్వ విద్యను గాడిన పెట్టే ఆలోచన రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి లేదని పిడిఎస్ యు రాష్ట్ర అధ్యక్షులు కాంపాటి పృథ్వీ అన్నారు. పిడియస్ యు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చర్ల మండల కేంద్రంలో విద్యార్థి పోరుబాట యాత్రను రాష్ట్ర అధ్యక్షులు కాంపాటి పృథ్వీ బిగిపిడికిలి జెండాను ఊపి ప్రారంభించారు. అనంతరం చర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల నుండి ప్రారంభమైన విద్యార్థి పోరాట యాత్ర ప్రభుత్వ పాఠశాల, గిరిజన బాలికల వసతి గృహం, బాలుర ఆశ్రమ పాఠశాలలను జీబు జాత బృందం సందర్శించింది. విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నేత మునిగెలా శివప్రశాంత్ అధ్యక్షత వహించి పాల్గొని మాట్లాడారు. కెసిఆర్ మాదిరిగానే నేడు రేవంత్ రెడ్డి కూడా అబద్ధాల పునాదులపై పాలన కొనసాగిస్తున్నాడని అన్నారు. ప్రభుత్వ విద్యా సంక్షేమాన్ని మరిచి తన రాజకీయ మైలేజ్ మార్క్ కోసమే కొత్త విద్యా విధాన రూపకల్పన చేశారని, అందులో భాగంగానే న్యూ ఇండియా ఇంటర్నేషనల్ పాఠశాలలు, స్పోర్ట్స్ యూనివర్సిటీ,స్కిల్ యూనివర్సిటీల పేరుతో ఒక్కొక్క పాఠశాలకు 200 కోట్లు కేటాయించామని రెండేళ్లు అయినా ఒక్క పునాదిరాయి కూడా వేయలేదని వారు విమర్శించారు. రాష్ట్రంలో విద్య కమిషన్ ఏర్పాటు పేరుతో రెండు సంవత్సరాలుగా ప్రభుత్వ విద్యను నిర్లక్ష్యం చేసి విద్యా కమిషన్ సూచించిన ఏ ఒక్క అంశాన్ని కూడా పరిష్కరించలేదని వారు తెలిపారు. విద్యార్థులకు మధ్యాహ్నం భోజనంలో నాణ్యత లేకపోయినా, ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని సూచించిన, ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించిన ఏ ఒక్కటి కూడా పట్టింపు లేకుండా రేవంత్ రెడ్డి ప్రభుత్వం కొనసాగుతుందని అన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో విద్యార్థులకు రావాల్సిన ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్షిప్ లను సుమారు పది లక్షల మంది విద్యార్థులకు రూ. 8600 కోట్ల బకాయిలు నేటికీ చెల్లించకపోవడం అసమర్థ ప్రభుత్వానికి నిదర్శనం అనేవారు ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో పాఠశాలలో మరుగుదొడ్ల సమస్యను విద్యార్థులు ఎదుర్కొంటున్నారని కంప్యూటర్లు లేని పాఠశాలలు అనేకం ఉన్నాయని, ఐదు వేల పాఠశాలలో విద్యార్థి నేలకు టాయిలెట్ సౌకర్యం లేదని అంటే కాంగ్రెస్ ప్రభుత్వం సిగ్గుపడాలని వారు విమర్శించారు. ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు మెనూ అమలు కావడం లేదని ప్రస్తుత ధర కనుగుణంగా మెనూ చార్జీలు రూపొందించలేకపోవడం అదేవిధంగా విద్యార్థులకు అందించే ఆహారానికి తగిన ప్రాతిపదికన కిరాణా సప్లై లేదనివారు తెలిపారు. తక్షణమే నూతన గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని, రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిని నియమించాలని వారు డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో విద్యార్థి పోరు బాట యాత్ర బృందం సభ్యులు బి. సాయి రామ్ చరణ్, శ్రావణి,విష్ణు, సంధ్య, భార్గవి, పవన్ కళ్యాణ్, లోకేష్, తరుణ తదితరులు పాల్గొన్నారు.

## విజయవాడలో సెప్టెంబర్ 6,7 తేదీల్లో ఎన్ యుజె(ఐ)జాతీయ కార్యవర్గ సమావేశాలు



**హైదరాబాద్, ఆగస్టు 25, (తెలంగాణ దిశ):** నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఇండియా) జాతీయ కార్యవర్గ సమావేశాలను సెప్టెంబర్ 6, 7 తేదీలలో విజయవాడలో నిర్వహించనున్నట్లు ఎన్ యుజె(ఐ) జాతీయ కార్యదర్శి మెరుగు చంద్రమోహన్ తెలిపారు. ఈ సమావేశాలకు జాతీయ అధ్యక్షుడు సురేష్ శర్మ, సెక్రటరీ జనరల్ త్రియుగ్ నారాయణ తివారీ హాజరవుతారని తెలిపారు. దేశంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు.



కుత్బుల్లాపూర్ నియోజక వర్గం పరిధిలో గాజులరామారం డివిజన్ సుభాష్ చంద్రబోస్ నగర్, మహదేవ పురం ఫేస్ 3 సీసీ రోడ్డు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో బిజెపి నాయకులు గాజులరామారం కార్పొరేటర్ రావుల శేషగిరి అధికారులకు వినతి సమర్పించడం వినతిపత్రంలో కోరారు. - (కుత్బుల్లాపూర్, తెలంగాణ దిశ)

# డబల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలి

- జిల్లా కలెక్టర్ మను చౌదరి





**మేడ్చల్ కలెక్టరేట్, ఆగస్టు 25, (తెలంగాణ దిశ)**డబల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ యం. మనుచౌదరి ఆదేశించారు. సోమవారం శామీర్‌పేట మండలం మురహరపల్లి గ్రామంలోని రెండు పడకల గదుల(అపార్ట్మెంట్) సముదాయాలను అదనపు కలెక్టర్ రాధికా గుప్తాతో పాటు వివిధ శాఖల అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. డబల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయాలకు సరిపడ నీటి వసతి కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఫారెస్టు అనుమతులలో కొంత జాప్యం జరుగుతున్నందున, పరిపాలన అనుమతుల కోసం ఉన్నతాధికారులతో సంప్రదించి , సత్వరమే పరిష్కరించాలని అటవీ, మిషన్ భగీరధ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా లబ్దిదారులతో మాట్లాడుతూ సమస్యలు ఏమున్నాయని ప్రశ్నించారు. ప్రహారీగోడ నిర్మించాలని కోరారు. తక్షణమే కలెక్టర్ స్పందించి ప్రహారీ గోడ నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కరెంట్ తో పాటు ఇంకా ఏమైనా మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అదే విధంగా అన్ని మౌళిక సదుపాయాలు కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం రాంపల్లి సమీపంలో నిర్మించిన రెండు పడకల గదులను సందర్శించి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పిడి రమణమూర్తి, శామీర్‌పేట తహసిల్దార్ యాదగిరి రెడ్డి, అటవీ, విద్యుత్, ఆర్ అండ్ బి, మిషన్ భగీరథ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన స్విమ్మర్లకు అభినందనలు


- ఎస్ సి కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతమ్



**హైదరాబాద్, ఆగస్టు 25, (తెలంగాణ దిశ)** :అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన స్విమ్మర్లు క్వీని విక్టోరియా గంధం, స్టిఫెన్ కుమార్ గంధంలను సోమవారం ఎస్ సి కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతం అభినందించారు. మహబూబ్ నగర్ జిల్లా నుంచితల్లి కొడుకులైన ఈ ఇద్దరూ తమ ప్రతిభతో అనేక అవార్డులను సొంతం చేసుకున్నారు. ఆసియా గిన్నిస్ రికార్డుల్లో స్థానం దక్కించుకోవడం, ఇంగ్లీష్ చానల్ ను ఈదిన తొలి తెలుగు మహిళగా క్వీని విక్టోరియా చరిత్ర సృష్టించారు. రామసేతును విజయవంతంగా ఈదడం వంటి అరుదైన విజయాలను సొంతం చేసుకున్నారు. తల్లి తనయులు తమ స్విమ్మింగ్ ప్రతిభతో దేశానికి పేరు తెచ్చారు. త్వరలో వీరు అమెరికాలోని కాథలినా చానెల్ ను ఈదేందుకు సిద్ధమవుతున్నారు. ఇటువంటి ప్రతిభావంతుల్ని ప్రోత్సహించడం తమ బాధ్యత... త్వరలోనే ముఖ్యమంత్రికి నివేదించి తగిన ఆర్థిక సాయం, ప్రోత్సాహం అందజేస్తామని ప్రీతం హామీ ఇచ్చారు. అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణకు గర్వకారణంగా నిలుస్తున్న వీరిని అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.వీరిని గౌరవించి ప్రోత్సహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. క్వీని విక్టోరియా గంధం, స్టిఫెన్ కుమార్ గంధంలు ప్రపంచ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించి రాష్ట్రానికి, దేశానికి గొప్ప పేరు సాధించి పెడతామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రదాన కార్యదర్శి అచ్యుత్ రమేష్ బాబు, ఎస్ సి సెల్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు పత్తి కుమార్ లు పాల్గొన్నారు.

# చర్ల మండల కేంద్రంగా గోవుల అక్రమ రవాణ





**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 25, (తెలంగాణ దిశ) :**మూగజీవాల ప్రాణాలతో చెలగాటమాడుతున్న గోవ్ మాఫియా వారు ఇష్టారాజ్యంగా గోవులను తరలిస్తున్న సంబంధిత శాఖ అధికారులు మాత్రం పట్టించుకోకపోవడంపై పలు విమర్శలకు దారితీస్తున్నాయి. చతిస్గడ్ సరిహద్దు ప్రాంతం నుంచి తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం కేంద్రానికి ఆవులు అటవీ ప్రాంతం మీదగా భారీగా వస్తున్నాయి, కొంతమంది చర్లకు చెందిన గోవుల మాఫియా వారు అమాయక గొత్తి కోయలను జీతగాళ్లగా పెట్టుకొని వారిద్వారా ఆవులను రోజుల తరబడి అడవిలోనే ఉంచుతూ సమయం ఉన్నప్పుడు చర్లకు తరలించి అక్కడి నుంచి హైదరాబాద్ తరలిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చర్ల నుంచి ములుగు జిల్లా వెంకటాపురం ఎటునాగారం మీదుగా హైదరాబాద్ కు వెళ్తున్నాయి, కుదిరితే పట్టపగలే భద్రాచలం, కొత్తగూడెం ఖమ్మం మీదగా హైదరాబాద్ కు పలు వాహనాలు గోవులు తరలిపోతున్నాయి. సోమవారం ఉదయం పట్టపగలే బొలెరో వాహనాల్లో ఆవులను తరలిస్తున్న గాని ఆపే నాధుడే లేకపోవడంతో గోవుల ముఠా వారిదే రాజ్యం అన్నట్లుగా ఉన్నది. ఒకవేళ ఆవులను తరలిస్తున్న ఆ బొలెరో వాహనాన్ని ఆపితే వారి దగ్గర ఉన్న పంచాయతీ సెక్రటరీ ఇచ్చిన లెటర్ ఒకటి చూపెడతారు. ఆ లెటర్‌లో మా ఆవులు రోగాల పాల య్యాయి. మేము వీటిని సాక లేక పోతున్నాం. మేము వేరే వారికి అమ్ముకుంటాము అందుకే ఈ వాహనంలో తరలిస్తున్నామని ఆ లెటర్ చూపెట్టి వెళ్ళిపోతారు... కానీ అదే లెటర్ చాలాసార్లు తిరుగుతుంది.. కానీ ఆవులు మాత్రం హైదరాబాదు వెళ్లి పలు హెూటల్స్ లో కైమాకు గురవుతున్నాయి. ఆ రెస్టారెంట్ లో స్పెషల్ మొగల్ బిర్యానీ అని ఉ ంటుంది కానీ చత్తీస్ ఘడ్ నుంచి వస్తున్న రోగాలు పాలైన ఆవులని వారికి తెలీదు.. ఇలా అమాయక మూగ జీవాల ప్రాణాలతో కొంతమంది బడా సెట్ లు కోట్లు గడించుకుంటున్నారని స్థానికులు తెలుపుతున్నారు. భద్రాచలం చెక్ పోస్ట్ లను దాటుకొని గోమాతలను తరలించే వాహనాలు ఎన్ని పోయినా సంబంధిత సంబంధిత శాఖ అధికారులకు తెలియకపోవడం గమనార్హం.

# కబ్జా కోరల్లోంచి గుడి స్థలాన్ని కాపాడాలని కోరుతూ ధర్నా






**నాగారం, ఆగస్టు 25, (తెలంగాణ దిశ)** :నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డు రామకృష్ణ నగర్ కాలనీలోని బీరప్ప గుడి స్థలం కబ్జా వ్యవహారం ఉద్రిక్తతకు దారి తీసింది. మాజీ కౌన్సిలర్ బిజ్జా శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో కాలనీవాసులు సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సర్వే నంబర్లు 64, 66, 74,75, 76, 77లోని 529 గజాల గుడి స్థలాన్ని అక్రమంగా ఆక్రమించారని ఆందోళన కారులు ఆరోపించారు.

గతంలో పంచాయతీ, మున్సిపాలిటీ హద్దుల్లో అనేక సార్లు జరిగిన ఆక్రమణలను అధికారులు కూల్చివేశారని, కానీ ఇప్పుడు కబ్జాదారులకు మద్దతుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. గుడి స్థలంతో పాటు రోడ్లు, పార్కు స్థలాలు కూడా ఆక్రమణకు గురవుతున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు నెలల క్రితం చేసిన ఫిర్యాదుపై స్పందించకపోవడమే కాకుండా, పార్కు కబ్జాలపై 'మేము ఏమీ చేయలేం' అని మున్సిపల్ కమిషనర్ నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారని ఆరోపించారు.

దీంతో ఆందోళనకారులు 'కమిషనర్ డౌన్ డౌన్' నినాదాలు చేస్తూ, వెంటనే గుడి స్థలంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ యువ మోర్చా నాయకుడు కౌకుట్ల రాహుల్ రెడ్డి, కాలనీ అధ్యక్షులు రామకృష్ణ యాదవ్, యాదగిరి, సంతోష్ గౌడ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


# గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిమజ్జన ఘాట్ లలో ఏర్పాట్ల పరిశీలన





**కుత్బుల్లాపూర్, ఆగస్టు 25, (తెలంగాణ దిశ)** :గణేష్ ఉత్సవ సమితి నిజాంపేట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలోగణేష్ విగ్రహాల నిమజ్జన ఘాట్ లలో ఏర్పాట్లను సోమవారం పరిశీలించారు. ఈ నెల 27 నుంచి ప్రారంభమయ్యే గణపతి నవరాత్రి ఉత్సవాలను గణేష్ ఉత్సవ సమితి కార్పొరేషన్ కన్వీనర్ మందపాటి శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక నాయకులు నరేంద్ర చౌదరి, బిక్షపతి యాదవ్, ప్రసాద్ రాజు, సుమన్ రావు, దాసి నాగరాజు, జక్కుల రవి యాదవ్, వేణుమాధవ్, సాయి కృష్ణ రెడ్డి, కాసాని సంతోష్, గజ్జల్లి సంతోష్ కుమార్, భూపాల్ రెడ్డి, గణేష్ ఉత్సవ నిర్వాహకులు కమిటీ సభ్యులతో కలిసి పర్యవేక్షించారు. కార్యక్రమ ఏర్పాట్ల నిర్లక్ష్యంపై ప్రశ్నిస్తూ నిజాంపేట కమిషనర్ మహమ్మద్ సాబేర్ అలీకి ఫోన్ చేసి కార్యక్రమ ఏర్పాట్ల నిర్లక్ష్యంపై మాట్లాడారు. కమిషనర్ స్పందిస్తూ యుద్ధ ప్రాతిపదికన తగు ఏర్పాట్లు చేస్తామని కార్యక్రమాలలో ఎటువంటి లోపం, నిర్లక్ష్యం జరగకుండా సిబ్బందిని అప్రమత్తం చేసి మరో 24 గంటల లోపల కార్యక్రమం ఏర్పాటును పూర్తి చేస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. స్థానిక నాయకులు మాట్లాడుతూ నిమజ్జన కార్యక్రమం సజావుగా సాగేందుకు అన్ని విభాగాల అధికారులు సహకరించాలని కోరారు. ఘాట్ లలో విద్యుత్తు పారిశుద్ధ్యం తాగునీరు తదితర సౌకర్యాలను ఏర్పాటు చేయాలని కోరారు. నిమజ్జన ఏర్పాట్ల విషయంలో అధికారులు శ్రద్ధ వహించి శాంతియుత వాతావరణం లో నిమజ్జనం జరిగేందుకు సహకరించాలని కోరారు.

# పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలనే పూజించాలి



**దమ్మాయిగూడ, ఆగస్టు 25, (తెలంగాణ దిశ) :**పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మట్టి గణేష్ విగ్రహాలని ప్రతిష్టించి పూజించాలని దమ్మాయిగూడ మాజీ సర్పంచ్, మాజీ కౌన్సిలర్ పాండాల అనురాధ యాదగిరి గౌడ్ కోరారు. సోమవారం పద్మశాలి టౌన్ షిప్ లో దీప వేముల అరవింద్ ఆధ్వర్యంలో సుమారు 500 మట్టి విగ్రహాలను కాలనీవాసులకు పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి విగ్రహాల పంపిణీకి ముందుకు వచ్చిన దీపా వేముల అరవింద్ ను పాండాల అనురాధ యాదగిరి గౌడ్ దంపతులు అభినందించారు. వీరిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని మట్టి విగ్రహాలను ప్రతిష్టించి పూజించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ నాయకులు దొంతు శీను, నారా జనార్ధన్, కిషోర్ రెడ్డి, దామోదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## భారత్‌కు బిగ్ బూస్ట్

భారత్ అంటేనే పుష్కలమైన సహజ వనరులకు కేరాఫ్ అడ్రస్. ఆంగ్లేయులు మన వనరులను కొల్లగొట్టినా.. కోట్లాది మంది భారతీయులకు ఈ పుణ్యభూమి తన సంపదను పంచుతూనే ఉంది. ప్రపంచవ్యాప్తంగా చమురు నిల్వలకు, ఖనిజ వనరులకు విపరీతమైన డిమాండ్ నెలకొన్న వేళ.. భారత్‌కు బూస్టనిచ్చే వార్తను శాస్త్రవేత్తలు అందించారు. ఈశాన్య రాష్ట్రాల్లో అరుదైన ఖనిజ నిక్షేపాలు ఉన్నాయని తెలిపారు. వాటిని వెలికితీసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఆ ఖనిజ సంపదను వెలికితీస్తే, దేశ అవసరాలకు సరిపోయేంత ఉంచుకుని, మిగిలినవి విదేశాలకు ఎగుమతి చేసుకోవడం ద్వారా.. ఆదాయం పొందే, అభివృద్ధి చెందే అవకాశాలు పుష్కలంగా ఉంటాయి. ఆత్మనిర్భర్ భారత్ కింద.. దేశానికి కావాల్సిన వస్తువులు, ఉత్పత్తులను మనమే తయారుచేసుకునే ప్రక్రియకు ఇది మరింత ఊతమిస్తుంది. 140 కోట్లకు పైగా జనాభా కలిగిన భారత్ లాంటి దేశాలకు.. ఏ వస్తువైనా భారీగానే డిమాండ్ ఉంటుంది. మన లాంటి దేశాలు.. ఇతర దేశాల నుంచి ఎన్ని వస్తువులను దిగుమతి చేసుకున్నా.. ఇంకా అవసరం పడుతూనే ఉంటాయి. దేశ జనాభా అవసరాలు తీరాలంటే దిగుమతులూ భారీగా ఉండాల్సిందే. ఇలాంటి తరుణంలో ఈశాన్య ప్రాంతం వ్యూహాత్మక, కీలకమైన ఖనిజ వనరులకు ఒక కొత్త కేంద్రంగా ఉద్భవించిందని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) వెల్లడించింది. క్లీన్ ఎనర్జీ ట్రాన్స్‌ఫర్మేషన్, డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, రక్షణ తయారీ రంగాలకు అత్యవసరమైన రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ (భూమిలోని అరుదైన మూలకాలు), గ్రాఫైట్, వెనాడియం, లిథియం, కోబాల్ట్ లాంటి ఖనిజాలు ఈశాన్య ప్రాంతంలో సమృద్ధిగా ఉన్నాయని.. జీఎస్ఐ నిర్వహించిన అధ్యయనాలు, అన్వేషణలు చెబుతున్నాయి. ప్రపంచంలోనే రేర్ ఎర్త్ మాగ్నెట్స్ (భూమిలోని అరుదైన మూలకాల)కు ప్రధాన ఎగుమతిదారుగా ప్రస్తుతం చైనా ఉంది. భూమిలోని అరుదైన మూలకాలు, తయారైన మూలకాల ఎగుమతులపై ఈ ఏడాది ఏప్రిల్‌లో చైనా ఆంక్షలు విధించింది. ఎలక్ట్రిక్ వాహనాల తయారీకి ఈ రేర్ ఎర్త్ మాగ్నెట్స్ అత్యంత కీలకం. 2025 ఆర్థిక సంవత్సరంలో భారత్ 540 టన్నుల మాగ్నెట్ దిగుమతి చేసుకోగా.. అందులో 80 శాతానికి పైగా చైనా నుంచి దిగుమతి చేసుకుంది. యూరోపియన్ క్లీన్ ఎనర్జీ రంగం కూడా తన రేర్ ఎర్త్ మాగ్నెట్స్ అవసరాల్లో దాదాపు 98 శాతం చైనా నుంచి దిగుమతి చేసుకుంటుంది. చైనా విధించిన ఆంక్షలతో పశ్చిమ దేశాలతో పాటు భారత్‌లోనూ తీవ్ర ఆందోళనలు నెలకొన్నాయి. దీనిపై స్పందించిన కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్.. భారత్ రేర్ ఎర్త్ మాగ్నెట్స్ కోసం చైనాపై ఆధారపడటాన్ని తగ్గించుకోవడానికి, ఇతర సప్లై చైన్ వెతికేందుకు ఒక మేల్కొలుపు లాంటిదని గత నెలలో కీలక వ్యాఖ్యలు చేశారు. దేశీయంగా పెరుగుతున్న అవసరాల నేపథ్యంలో.. చైనా ఆంక్షలు.. మన దేశంలోనే వనరులను వెలికితీసే ప్రక్రియ ఆవశ్యకతను మరోసారి గుర్తు చేశాయి. అలాంటి వనరుల కోసం భారత్‌లో డిమాండ్ పెరుగుతున్న సమయంలో ఈశాన్య ప్రాంతంలో ఉన్న అరుదైన ఖనిజ సంపదకు సంబంధించి.. జీఎస్ఐ 57 పేజీల నివేదికలో వెల్లడించడం గమనార్హం. నేషనల్ మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ ట్రస్ట్ నిధులతో ఈశాన్య ప్రాంతంలో ప్రస్తుతం అనేక ప్రాజెక్టులు జరుగుతున్నాయి. భారతదేశంలోని ఈశాన్య రాష్ట్రాలపైన అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, మణిపూర్, మేఘాలయ, మిజోరాం, నాగాలాండ్, సిక్కిం, త్రిపుర రాష్ట్రాలు.. 2.62 లక్షల చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్నాయి. ఇది దేశం మొత్తం భౌగోళిక ప్రాంతంలో 8 శాతం. ఈశాన్య ప్రాంతం ప్రత్యేకమైన భూగర్భ నిర్మాణాన్ని కలిగి ఉండి.. ఒఫియోలైట్ బెల్టులు, ఆల్కలైన్–అల్ట్రామాఫిక్ కాంప్లెక్స్‌లు, గ్రాఫైట్–బేరింగ్ స్కిస్టులతో కూడినవని.. అనేక ముఖ్యమైన ఖనిజాలకు అనుకూలమైన వాతావరణాన్ని అందిస్తున్నాయని జీఎస్ఐ పేర్కొంది. టెక్నాలజీ అభివృద్ధి, క్లీన్ ఎనర్జీ వైపు భారత్ సిద్ధమవుతున్న తరుణంలో.. ఈశాన్య ప్రాంతంలో ఉన్న ఖనిజ వనరులు కీలక పాత్ర పోషించనున్నాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. మన దేశంలో సహజ ఫ్లేక్ గ్రాఫైట్‌కు అత్యంత ముఖ్యమైన దేశీయ వనరుగా అరుణాచల్ ప్రదేశ్ అవతరించింది. వెస్ట్ సియాంగ్, పాపుమ్ పారే, లోయర్ సుబన్సిరి జిల్లాల్లో గ్రాఫైట్ ప్రధాన నిక్షేపాలను గుర్తించారు. అక్కడ 17.89 మిలియన్ టన్నులకు పైగా గ్రాఫైట్ వనరులు ఉన్నాయని జీఎస్ఐ అంచనా వేసింది. ఈ ప్రాంతంలోని గ్రాఫైట్ సాధారణంగా 5 శాతం నుంచి 25 శాతం వరకు స్థిర కార్బన్ కంటెంట్‌తో కూడిన సన్నని మధ్యస్థ ఫ్లేక్‌లను కలిగి ఉంటుందని తెలిపింది. ఇది లిథియం–అయాన్ బ్యాటరీ అనోడ్‌ల వంటి వాటికి అనుకూలమైన ముడి పదార్థంగా చేస్తుందని పేర్కొంది. ఇక అరుణాచల్ ప్రదేశ్‌లోనే మరో ప్రధాన ఖనిజం వెనాడియంను గుర్తించారు. స్టీల్ మిశ్రమాలు, ఇతర పారిశ్రామిక అవసరాల్లో ఈ వెనాడియంను ఉపయోగిస్తారు. 13.79 మిలియన్ టన్నుల వెనాడియం ఉంటుందని అంచనా వేస్తున్నారు. అస్సాం, మేఘాలయ రాష్ట్రాల్లో జీఎస్ఐ చేసిన పరిశోధనల్లో భూమిలోని అరుదైన మూలకాలు ఉన్నట్లు తెలిసింది. అస్సాంలో వెయ్యి నుంచి 5 వేల పీపీఎం (పార్ట్స్ పర్ మిలియన్) గాఢతతో భూమిలోని అరుదైన మూలకాలు ఉన్నట్లు జీఎస్ఐ కనుగొంది. మేఘాలయలో 3,646 నుంచి 5,100 పీపీఎం మధ్య భూమిలోని అరుదైన మూలకాలు విలువలను చూపించాయని పేర్కొంది. అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్, అస్సాం రాష్ట్రాల్లో లిథియం నిక్షేపాల సూచనలు ఉన్నాయని జీఎస్ఐ నివేదిక వెల్లడించింది. అయితే వీటి అన్వేషణ ఇంకా ప్రారంభ దశల్లోనే ఉన్నప్పటికీ.. మన దేశం లిథియం కోసం దిగుమతులపైనే భారీగా ఆధారపడటాన్ని పరిగణనలోకి తీసుకుంటే.. వీటికి సంబంధించి మరింత అన్వేషణ చేయాల్సిందే. అదే సమయంలో భూరసాయన సర్వేలు, పెట్రోగ్రాఫిక్ అధ్యయనాల ద్వారా లక్ష్యంగా చేసుకుని నాగాలాండ్, మణిపూర్‌లోని ఒఫియోలైట్ కాంప్లెక్స్‌లతో సంబంధం ఉన్న నికెల్, కోబాల్ట్‌ను కనుగొన్నారు. ఈ రెండు రాష్ట్రాల్లోని పురాతన శిలల ఆనవాళ్లుగా నికెల్, కోబాల్ట్ ఉన్నాయని.. వాటిని ఆర్థికంగా తిరిగి పొందడానికి అత్యాధునిక టెక్నాలజీ అవసరమని తెలుస్తోంది. ఈశాన్య రాష్ట్రాల్లో ఉన్న కీలక ఖనిజాల పరిశోధనలను మరింత వేగవంతం చేయడానికి.. 2024–25లో క్రిటికల్ మినరల్ అసెస్‌మెంట్ ప్రోగ్రామ్ (సీఎంఏపీ)ని ప్రారంభించింది. ఈ కార్యక్రమం కింద.. మణిపూర్–నాగాలాండ్, మేఘాలయ, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లోని లాటరైట్, కార్బోనేషియస్ శిలలు, ఆల్కలైన్ కాంప్లెక్స్‌ల సామర్థ్యాన్ని అంచనా వేయడంపై దృష్టి సారించనున్నారు. ఈ ఈశాన్య రాష్ట్రాలు వివిధ దేశాలతో సరిహద్దును పంచుకుంటున్నాయి. చైనా, భూటాన్, మయన్మార్, బంగ్లాదేశ్, నేపాల్ వంటి ఐదు దేశాలు భారత ఈశాన్య ప్రాంతానికి సరిహద్దులుగా ఉన్నాయి. ఈ భౌగోళిక స్థానం దేశ ఈశాన్య ప్రాంతానికి జాతీయ భద్రత, దేశ యాక్ట్ ఈస్ట్ పాలసీ కింద సరిహద్దు వాణిజ్యం, ఆర్థిక ఏకీకరణ పరంగా వ్యూహాత్మకంగా ఎంతో ప్రాముఖ్యతను కలిగి ఉంది. అంతేకాకుండా ఈశాన్య రాష్ట్రాల్లో భూభాగం ఎక్కువగా కొండలు, పర్వతాలు, లోయలు, విశాలమైన నదీ లోయలు, విస్తృతమైన అటవీ విస్తీర్ణంతో నిండి ఉంది. ఇవన్నీ అక్కడి గొప్ప జీవవైవిధ్యాన్ని చూపిస్తున్నప్పటికీ.. రవాణా పరంగా, మౌలిక సదుపాయాల పరంగా అనేక సవాళ్లను దేశం ముందు ఉంచుతున్నాయి. ఇన్ని సవాళ్లు ఉన్నప్పటికీ.. ఈశాన్య ప్రాంతంలో ఉన్న ఖనిజ సామర్థ్యం కారణంగా మరింత ఆసక్తికరంగా, ఆకర్షించే విధంగా ఉంది. ఈ పరిశోధనలు దేశ భవిష్యత్తుకు కొత్త దారులు తెరుస్తాయని ఆశిద్దాం.

## భాగ్యనగర్ ఉత్సవ కమిటీ ఏఎస్ రావు నగర్ డివిజన్ కన్వీనర్ గా నీరుకొండ సతీష్ బాబు



**ఏఎస్ రావు నగర్, ఆగస్టు 25, (తెలంగాణ దిశ) :** భాగ్యనగర్ ఉత్సవ సమితి ఏఎస్ రావు నగర్ డివిజన్ కన్వీనర్ గా నీరుకొండ సతీష్ బాబు నియమితులయ్యారు. సోమవారం జరిగిన ఉత్సవ సమితి సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. భాగ్యనగర్ గణేష్ ఉత్సవ కమిటీ అసెంబ్లీ కన్వీనర్ చల్లా ప్రభాకర్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. అందరి మద్దతుతో గణేష్ ఉత్సవాలు శాంతియుతంగా జరిగేందుకు కృషి చేస్తానని సతీష్ బాబు అన్నారు. తనను భాగ్యనగర్ ఉత్సవ సమితి ఏఎస్ రావు నగర్ డివిజన్ కన్వీనర్ గా ఎన్నుకున్న అఖిలపక్ష నాయకులకు,
భాగ్యనగర్ ఉత్సవ సమితి నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష కమిటీ నాయకులు బి. రాఘవరెడ్డి, మర్రి మోహన్ రెడ్డి, రమేష్ యాదవ్, వెంకట హరి రాములుయాదవ్, సీతారాం రెడ్డి,తాడూరి గగన్ కుమార్, కుమార స్వామి, వెంకటాచలం, సతీష్ రెడ్డి, కిషోర్ చారి, సందీప్ చారి, సోమేష్ నాయుడు, సంధ్యారెడ్డి, నర్సిరెడ్డి, రమాదేవి, శివ కామేశ్వరి, శివానంద్, గోబేరు రమేష్ వెంకటేశ్వరరావు, పవన్, నాగరాజు, అప్పి, దశరథ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.




## జీనియా హాస్పిటల్ ఆధ్వర్యంలో 250 మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



వినాయక చవితి పండుగ సందర్భంగా ఈసీఐఎల్ చౌరస్తాలోని జీనియా హాస్పిటల్ ఆధ్వర్యంలో సోమవారం దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయంలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకటరెడ్డి చేతుల మీదుగా 250 మట్టి వినాయకులను పంపిణీ చేశారు. ప్రజలందరూ మట్టి విగ్రహాలకు పూజచేసి పర్యావరణాన్ని కాపాడాలని కమిషనర్ కోరారు.

- (దమ్మాయిగూడ, తెలంగాణ దిశ)




## రాజ్ కుమార్ బుంగ థ్రెడ్ అకౌంట్ పై సుమన్ టీవీ సీఈఓ నిరుపమా పోలీసులకు ఫిర్యాదు

కూకట్ పల్లి బాలిక సహస్ర హత్యపై సుమన్ టీవీ సీఈఓ నిరుపమా చేసిన వీడియోలపై సోషల్ మీడియా అకౌంట్ థ్రెడ్ లో రాజ్ కుమార్ బుంగ పేరుతో వ్యక్తిగత దూషణ చేస్తూ పరువుకు భంగం కలిగించేలా పోస్టు చేయడంపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు న్యాయవాది వల్లభనేని పవన్ ఫిర్యాదు చేసారు. ఇటువంటి దిగజారుడు పనులకు పాల్పడుతున్న వ్యక్తులపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు.

- (కూకట్ పల్లి, తెలంగాణ దిశ)

## వినాయక చవితి పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి



### - కుషాయిగూడ సిఐ భాస్కర్ రెడ్డి

**కుషాయిగూడ, ఆగస్టు 25, (తెలంగాణ దిశ) :** వినాయక చవితి పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కుషాయిగూడ సర్కిల్ ఇన్ స్పెక్టర్ ఎల్. భాస్కర్ రెడ్డి సూచించారు. సోమవారం ఏఎస్ రావు నగర్ డివిజన్ అణుపురం కమ్యూనిటీ హాల్ లో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, మరియు గణేష్ మండపాల నిర్వాహకులతో జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ మండపాల వద్ద పాటించాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ముఖ్యంగా డీజేలకు అనుమతి లేదని అన్నారు. రాత్రి 10 గంటల తర్వాత తప్పకుండా మైకులను బంద్ చేయాలని సూచించారు. ఇతరులకు ఇబ్బంది కలిగించకుండా ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. ఎలక్ట్రికల్ లైన్ల కింద, ట్రాన్స్ ఫార్మర్ల దగ్గర గణేష్ మండపాలను ఏర్పాటు చేయవద్దని సూచించారు. అదే విధంగా గణేష్ మండపానికి విద్యుత్ తీసుకునే సర్వీస్ వైరు జాయింట్లు లేకుండా చూసుకోవాలన్నారు. విద్యుత్ తీగలను ఇనుప పైపులతో, ఇనుప పైపులతో వేసిన టెంట్ తో తాక కూడదని సూచించారు. వైరు తాకినచోట సరైన ఇన్సులేషన్ చేయాలన్నారు. గణేష్ విగ్రహ మండపానికి కావలసిన లోడు ప్రకారం తగిన సామర్థ్యమైన సర్వీస్ వైర్, రేటెడ్ ఇన్సులేషన్ గల కేబుల్ ఉపయోగించాలని సూచించారు. సరేనా ఎర్తింగ్ తో త్రీ పిన్ సాకెట్ ఉపయోగించాలన్నారు. ఒకసారి సర్వీస్ వైర్ విద్యుత్ పోల్ కు అమర్చిన తర్వాత, సంబంధిత ఏరియా లైన్ మెన్ లేదా జెఎల్ యంలకు తెలియకుండా ఎటువంటి మార్పులు చేయకూడదన్నారు. ఇన్వర్టర్, జనరేటర్ ఉపయోగించినట్లయితే, రిటర్న్ కరెంట ప్రవాహాన్ని నివారించడానికి సరైన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పోలీసుల మార్గదర్శకాల ప్రకారం వాలంటీర్లకు ఐడి కార్డులు తప్పనిసరి అని తెలిపారు. ఈ సమావేశంలో డిటెక్టివ్ ఇన్ స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్‌లక్ష్మణ్ రాజు, సబ్ ఇన్ స్పెక్టర్లు ఎన్. సుధాకర్ రెడ్డి, శ్రీనివాస్, వెంకన్న, సతీష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ ఐఐటీలో డ్రైవర్‌లెస్ బస్సులు..



హైదరాబాద్,: డ్రైవర్ అవసరం లేకుండా వాతంతట అవే నడిచే బస్సులు ఇక కల కాదు. హైదరాబాద్‌లో ఇది వాస్తవరూపం దాల్చింది. నగరంలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) క్యాంపస్‌లో డ్రైవర్‌లెస్ మినీ బస్సులు ప్రయాణికులకు సేవలందిస్తున్నాయి. దేశంలోనే తొలిసారిగా ఒక విద్యాసంస్థ ప్రాంగణంలో పూర్తిస్థాయిలో డ్రైవర్‌రహిత బస్సులను వినియోగించడం ఇదే మొదటిసారి కావడం విశేషం. ఐఐటీ హైదరాబాద్‌కు చెందిన 'టెక్నాలజీ ఇన్నోవేషన్ హబ్ ఆన్ అటానమస్ నావిగేషన్ (టీహన్)' అనే ప్రత్యేక పరిశోధన విభాగం ఈ సాంకేతికతను పూర్తిగా దేశీయంగా అభివృద్ధి చేసింది. ప్రస్తుతం ఆరు సీట్లు, పద్నాలుగు సీట్ల సామర్థ్యంతో రెండు రకాల విద్యుత్ బస్సులను క్యాంపస్‌లో నడుపుతున్నారు. గత మూడు రోజులుగా విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది వర్సిటీ మెయిన్ గేటు నుంచి ఇతర విభాగాలకు వెళ్లేందుకు ఈ బస్సులనే వినియోగిస్తున్నారు. ఈ వాహనాల్లో ప్రయాణ భద్రతకు పెద్దపీట వేశారు.

# రంగంలోకి మంత్రుల కమిటీ

### సూచనలు కోరుతున్న బృందం



గుంటూరు, : ఏపీ ప్రభుత్వం ఇటీవల కీలక నిర్ణయం తీసుకుంది. వైసీపీ హయాంలో చేపట్టిన జిల్లాల పునర్వ్యవస్థీకరణ, కొత్త జిల్లాల ఏర్పాటులో సమస్యలు ఉన్నాయంటూ.. వారి పరిష్కారం కోసం మంత్రుల కమిటీని ఏర్పాటు చేసింది. జిల్లా, మండలం, గ్రామాల పేర్లు, సరిహద్దుల మార్పులపై ఈ కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటైంది. ఈ మంత్రివర్గ ఉప సంఘం తొలిసారిగా సమావేశమైంది. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై చర్చించారు. అనంతరం సెప్టెంబర్ 15వ తేదీ నాటికి సీఎం చంద్రబాబుకు నివేదిక సమర్పించాలని నిర్ణయించారు. ఏపీలో జిల్లాల పేర్లు, సరిహద్దుల మార్పులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఇందుకోసం సీఎం నారా చంద్రబాబు నాయుడు మంత్రివర్గ ఉప సంఘం కూడా ఏర్పాటు చేశారు. ఏపీ రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ నేతృత్వంలో ఏడుగురు మంత్రులతో మంత్రుల కమిటీని ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో మంత్రుల కమిటీ ఈ విషయం మీద అధ్యయనం జరపనుంది. అనంతరం సీఎం చంద్రబాబుకు నివేదిక సమర్పిస్తారు. చంద్రబాబు ఆ నివేదికను పరిశీలించిన అనంతరం కేబినెట్ భేటీలో చర్చించి ఆపై నిర్ణయం తీసుకుంటారు. ఇంత ప్రక్రియ జరగాల్సి ఉంది. అయితే మంత్రుల కమిటీ సీఎం చంద్రబాబుకు ఎప్పుడు నివేదిక సమర్పిస్తారనే దానిపై క్లారిటీ వచ్చింది. గ్రామాలు, మండలాలు, జిల్లాల పేర్లు , సరిహద్దుల మార్పులపై ఏర్పాటైన మంత్రుల కమిటీ తొలిసారిగా బుధవారం సమావేశమైంది. జిల్లాల పునర్వ్యవస్థీకరణ సమస్యల పరిష్కారంపై కేబినెట్ సబ్ కమిటీ చర్చించింది. అనగాని సత్యప్రసాద్‌తో పాటుగా మంత్రులు నారాయణ, వంగలపూడి అనిత, నిమ్మల రామానాయుడు, బీసీ జనార్ధన్ రెడ్డి, సత్యకుమార్ యాదవ్, నాదెండ్ల మనోహర్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. వివిధ అంశాలపై చర్చించిన మంత్రులు.. సెప్టెంబర్ 15 నాటికి నివేదికను సీఎం చంద్రబాబుకు అందించాలని నిర్ణయించారు. మరోవైపు డిసెంబర్ 31లోగా జిల్లాల పేర్లు, సరిహద్దుల మార్పుల ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలోనే వచ్చే నెల 15వ తేదీ నాటికి ముఖ్యమంత్రి చేతికి నివేదిక అందించనున్నట్లు మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. ఇందులో భాగంగా ఆగస్ట్ 29, 30 తేదీల్లో మంత్రుల బృందం ఉమ్మడి జిల్లాలలో పర్యటించనుంది. మంత్రుల కమిటీ రెండు గ్రూపులుగా జిల్లా కేంద్రాల్లో పర్యటిస్తుంది. ఈ పర్యటనలో ప్రజాప్రతినిధులు, ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారు. అలాగే ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి వచ్చిన సూచనలు, వినతులను వీటితో కలిపి.. సెప్టెంబర్ 15వ తేదీ నాటికే నివేదికను సీఎంకు అందజేస్తారు. మరోవైపు గ్రామాలు, మండలాలు, జిల్లాల పేర్లు, సరిహద్దుల మార్పులపై ప్రజలు తమ వినతులను జిల్లా కలెక్టర్లకు అందజేయవచ్చు. ఇందుకు సెప్టెంబర్ రెండో తేదీ ఆఖరు అని మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడించారు. పేర్లు, సరిహద్దుల మార్పు అంశంతో పాటుగా కొత్త జిల్లాల ఏర్పాటు విషయాన్ని కూడా పరిశీలిస్తామని చెప్పారు. అయితే నియోజకవర్గాలతో సంబంధం లేదని క్లారిటీ ఇచ్చారు. మరోవైపు ప్రజలకు అందుబాటులో ఉండటం, పరిపాలనా సౌలభ్యం, ప్రభుత్వానికి ఆదాయం పెంచటం లక్ష్యంగా మంత్రుల కమిటీ సూచనలు ఉంటాయని అనగాని సత్యప్రసాద్ వివరించారు. మరోవైపు మంత్రుల కమిటీ సమావేశం సందర్భంగా 15 మంది జిల్లా, మండల, గ్రామాల పేర్లు, సరిహద్దుల మార్పుపై కేబినెట్ సబ్ కమిటీకి తమ వినతులను సమర్పించారు. గుంటూరు లేదా పల్నాడు జిల్లాకు గుర్రం జాషువా పేరు పెట్టాలని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ వినతి పత్రం సమర్పించారు. అలాగే బాపట్ల జిల్లా కేంద్రాన్ని చీరాలకు మార్చాలని కొందరు, బాపట్ల జిల్లాకు దుగ్గిరాల గోపాల క్రిష్ణయ్య పేరు పెట్టాలని మరికొంతమంది కోరారు. ఇక శ్రీకాకుళం జిల్లా మురపాక నుంచి వచ్చిన కొంతమంది గ్రామస్థులు.. తమ గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని కోరారు.

# ఏఎస్ రావునగర్ లో మెడికవర్ క్లినిక్స్ ప్రారంభం

## - ఆధునిక సూపర్ స్పెషాలిటీ సేవలతో ప్రజలకు మరింత చేరువ









**ఏఎస్ రావునగర్, ఆగస్టు 25, (తెలంగాణ దిశ) :**ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలను మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో మెడికవర్ హాస్పిటల్స్ తమ కొత్త మెడికవర్ క్లినిక్స్‌ను ఏఎస్ రావునగర్ లో సోమవారం ప్రారంభించింది. ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. స్థానిక కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి గౌరవ అతిథిగా హాజరయ్యారు. బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి ప్రత్యేక అతిథిగా హాజరై మెడికవర్ క్లినిక్స్‌నుఈ క్లినిక్‌లో కార్డియాలజీ, ఇంటర్నల్ మెడిసిన్, న్యూరాలజీ, పల్మనాలజీ, గైనకాలజీ, గాస్ట్రో ఎంటరాలజీ వంటి సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులో ఉన్నాయి. ఈ సందర్భంగా బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ "ఏఎస్ రావునగర్‌లో మెడికవర్ క్లినిక్స్ ప్రారంభం చాలా సంతోషకరమైన విషయం. స్థానిక ప్రజలకు సమీపంలోనే నిపుణుల వైద్య సేవలు అందించడానికి ఇది ఎంతో దోహదం చేస్తుంది. మెడికవర్ ఎల్లప్పుడూ అగ్రశ్రేణి ఆరోగ్య సేవలు అందించడంలో ముందంజలో ఉందన్నారు. కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి మాట్లాడుతూ మన ప్రాంతంలో ప్రత్యేక వైద్య సేవలు అందుబాటులో ఉండటం చాలా అవసరమన్నారు. ఏఎస్ రావు నగర్‌లో మెడికవర్ క్లినిక్స్ ఏర్పాటు చేసినందుకు అభినందనలు తెలిపారు. వ్యాపార దృక్పథంతో కాకుండా అన్ని వర్గాలకు అందుబాటులో ఉండే విధంగా సేవలు అందించాలని సూచించారు. ప్రత్యేక అతిథి సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి మాట్లాడుతూ మెడికవర్ ఆసుపత్రులు ఇప్పటికే ప్రజల్లో విశ్వాసాన్ని పొందాయని అన్నారు. ఈ కొత్త క్లినిక్ ద్వారా ఏఎస్ రావునగర్ తో పాటు సమీప కాలనీల ప్రజలకు సమీపంలోనే నిపుణుల సేవలు పొందగలరని, ఇది అభినందనీయమన్నారు. మెడికవర్ హాస్పిటల్స్ ఇండియా చీఫ్ ఆఫ్ బిజినెస్ ఆపరేషన్స్ మహేష్ డెగ్లూర్కర్ మాట్లాడుతూ ప్రపంచ స్థాయి ఆరోగ్య సేవలను అందుబాటులోకి తీసుకురావడం, రోగి స్నేహపూర్వకంగా సేవలు అందించడం మెడికవర్ సాధ్యమన్నారు. ఈ కొత్త క్లినిక్ ప్రారంభం మా ప్రయాణంలో ఒక ముఖ్యమైన అడుగు అని అన్నారు.ఏఎస్ రావు నగర్‌లో ప్రారంభమైన ఈ కొత్త క్లినిక్, హైదరాబాద్‌లో కమ్యూనిటీ హెల్త్ కేర్‌ను బలోపేతం చేసే దిశగా మరో ముందడుగుగా నిలుస్తుందన్నారు.

# గిరిజనుల సమస్యల సత్వర పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపాలి

## - ఐటీడీఏ పీవో రాహుల్



**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 25,(తెలంగాణ దిశ) :** భద్రాచలం ఐటీడీఏలో జరిగిన దర్బారుకు గిరిజనులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఐటిడిఏ ప్రాజెక్టు అధికారికి పలు సమస్యలతో కూడిన పత్రాలను అందచేసి తమ సమస్యలకు పరిష్కార మార్గాలు చూపాలని కోరారు. సోమవారం ఐటిడిఏ సమావేశం మందిరంలో జరిగిన దర్బార్ లో పిఓ బి. రాహుల్ పాల్గొన్నారు. గిరిజన సమస్యలు తెలుసుకొని వారి వద్ద వినతిపత్రాలు స్వీకరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుదూర గిరిజన గ్రామాల నుండి గిరిజన దర్బారుకు వివిధ సంక్షేమ పథకాల కోసం అర్జీలు పెట్టుకునే గిరిజనులకు అర్హులైన వారిని గుర్తించి వారందరికీ ప్రభుత్వ పథకాలు అందే విధంగా ఐటిడిఏ యూనిట్ అధికారులు అందరూ ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఏజెన్సీలో గిరిజనులుకు ఉన్న సమస్యలు వెంటనే గుర్తించి వారిని పరిష్కరించి మిగతా వాటిని సంబంధిత శాఖ అధికారులకు పంపుతూ అర్హులైన ప్రతి గిరిజన కుటుంబాలకు సంక్షేమ పథకంలో అందే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ జనరల్ డేవిడ్ రాజ్, డిడి ట్రైబల్ వెల్ఫేరి అధికారిని మణెమ్మ తదితర ఐటిడిఏ యూనిట్ అధికారులు పాల్గొన్నారు.

# నిర్మల్ జిల్లా కలెక్టరేట్ ముట్టడించిన గుండెగాం గ్రామస్తులు







**బైంసా, ఆగస్ట్ 25, తెలంగాణ దిశ) :**పల్సీకర్ రంగారావు ప్రాజెక్టు ముంపు గ్రామమైన గుండెగాం గ్రామస్తులు సోమవారం నిర్మల్ జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగాతమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం నిర్మల్‌కలెక్టర్ అభిలాష్ ను కోరారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో తమ మోసపోయామని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వమైనా తమ సమస్యలకు పరిష్కారం చూపాలని కోరారు. ప్రతి వర్షాకాలంలో గ్రామం అవుతున్న అధికారులు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

వెంటనే తమకు ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామంలో 450 కుటుంబాలు ఉన్నాయని తెలిపారు. న్యాయం చేసే వరకు పోరాటం కొనసాగుతుందని ప్రకటించారు. గత ఆరు సంవత్సరాలుగా అందరూ నా కార్యక్రమాలు చేపడుతున్న

స్పందించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. తక్షణమే తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని ప్రకటించారు.

# పెండింగ్ స్కాలర్ షిప్స్, ఫీజు రియంబర్స్ మెంట్ లను వెంటనే విడుదల చేయాలి : ఎబివిపి




**కుత్బుల్లాపూర్, ఆగస్టు 25, (తెలంగాణ దిశ) :**పెండింగ్ లో ఉన్న స్కాలర్ షిప్స్, ఫీజు రియంబర్స్ మెంట్ నీ వెంటనే విడుదల చేయాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఎబివిపి) నాయకులు కోరారు. ఎబివిపి కూకట్ పల్లి విభాగ్ నాయకులు సోమవారం చింతల్ నగర శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా కూకట్ పల్లి విభాగ్ కన్వీనర్ నగేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గత ఐదు సంవత్సరాలుగా ఫీజు రియంబర్స్ మెంట్, స్కాలర్ షిప్స్ న్యూజిలాండ్ విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. గతంలో పది సంవత్సరాలు పాలించిన ఫామ్ హౌస్ ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తామని చెప్పి వెలగ బెట్టిందేమీ లేదన్నారు. ప్రస్తుతం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అదే రీతిలో పాలన సాగించడం చాలా సిగ్గుచేటన్నారు. ప్రజా పాలన పేరుతో ప్రజలకు సేవ చేయకుండా ఢిల్లీ పెద్దలకు సద్దులు మోస్తు ఈ ప్రభుత్వం దిగజారిపోయిందని ఆయన విమర్శించారు. ఈ సంవత్సరం రాష్ట్ర బడ్జెట్ లో విద్యాశాఖకు 7 శాతం కేటాయించి విద్యా వ్యవస్థను అవహేళన చేసిందన్నారు, విడుదల చేయవలసిన 8312 కోట్ల రియంబర్స్ మెంట్ బకాయిలను కూడా కనీసం విడుదల చేయడం లేదన్నారు. 1200 మంది విద్యార్థుల బలిదానంతో ఏర్పడిన ఈ తెలంగాణ మళ్లీ విద్యార్థుల ఆర్తనాదాలకు కారణం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ప్రియాంక, భాగ్య నగర్ మహానగర్ సభ్యురాలు లక్ష్మి, జిల్లా గర్ల్స్ కన్వీనర్ ప్రసన్న,నగర కార్యవర్గ సభ్యురాలు జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలను నిలిపి వేయాలి

## - నిజాంపేట మున్సిపల్ కమిషనర్ కు వినతి



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 25, (తెలంగాణ దిశ) :**నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ ఆస్తులైన రోడ్లు, పార్కులు, ప్రభుత్వ భూములను, చెరువులను కాపాడాలని కోరుతూ నిజాంపేట మున్సిపల్ కమిషనర్ సాబీర్ అలీకి సోమవారం ఆకుల సతీష్ వినతిపత్రం అందించారు. ముఖ్యంగా నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారులు పలువురు కబ్జా.దారులకు సహకరిస్తూ వారి అక్రమాలకు వంత పాడుతున్నారని విమర్శించారు. గతంలో పలుమార్లు ఇదే సమస్యపై వినతి పత్రాలు సమర్పించిన అధికారులు సహకరించడం లేదన్నారు. ఇప్పటికైనా అవినీతికి పాల్పడుతున్న,

కబ్జాదారులకు సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకుని ప్రజా ఆస్తులను కాపాడాలని కోరారు. ఈ విషయంలో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తే జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదుతో పాటు, హైకోర్టులో అవినీతి అధికారులపై కేసులు వేస్తామని ఆయన కమిషనర్ కు స్పష్టం చేశారు. కమిషనర్ ను కలిసిన వారిలో పలువురు నిజాంపేట్ వాసులు పాల్గొన్నారు.

# అధికారులు లేని ప్రజావాణి ఎందుకు..




## - గుడిమెట్ల సురేష్ రెడ్డి

**కుత్బుల్లాపూర్, ఆగస్టు 25,(తెలంగాణ దిశ) :**ప్రజావాణిలో అన్ని శాఖల అధికారులు లేకపోవడం వల్ల ప్రజలకు ఏమి ఉపయోగమని మాజీ కార్పొరేటర్ గుడిమెట్ల సురేష్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సురేష్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ప్రజావాణి కార్యక్రమం అంటే ప్రజల సమస్యలు, ఫిర్యాదులు స్వీకరించి, వాటిని పరిష్కరించడానికి ఏర్పాటు చేసిన ఒక వేదిక, కానీ ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారులకు తెలియజేసినా సమస్యలు పరిష్కారం దిశగా చర్యలు ఎందుకు తీసుకోకవడం లేదని అధికారులను నిలదీశారు. అధికారుల అలసత్వం వల్ల ప్రజావాణి కి విలువ లేకుండా పోతుందని అన్నారు. ఈ ప్రభుత్వం ప్రజల సమస్యలను గాలికి వదిలేసి కక్ష సాధింపు చర్యలకు దిగుతుందని దుయ్యబట్టారు. సూరారం కాలనీలో రాంలీలా మైదానం వద్ద గల చాచా నెహ్రు పార్కు కబ్జా కాకుండా చూడాలని ఒక మాజీ ప్రజాప్రతినిధిగా తాను ఇచ్చిన ఇచ్చిన వినతి పత్రంపై ఇప్పటి వరకు స్పందన లేదని విమర్శించారు. ఇప్పటికైనా స్పందించి పార్కు కబ్జా కాకుండా చూడాలని అధికారులను కోరారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో డివిజన్ ప్రధాన కార్యదర్శి శివాజీ, ఆర్ జికె అధ్యక్షులు శివగౌడ్, విజయ్, నరేందర్ రెడ్డి, విఠల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బాలాజీ రామ్ గోపాల్ స్వీట్స్ షాప్ పై ఆకస్మిక తనిఖీ: రూ. 11 వేల జరిమాన



**హెచ్‌బి కాలనీ, ఆగస్టు 25, (తెలంగాణ దిశ) :** కాప్రా సర్కిల్ పరిధిలోని మీర్ పేట్, హెచ్ బి కాలనీ ప్రధాన రహదారిపై ఉన్న బాలాజీ రామ్ గోపాల్ స్వీట్స్ షాప్ పై సోమవారం కాప్రా మున్సిపల్ అధికారులు ఆకస్మిక తనిఖీ చేశారు. అపరిశుభ్ర వాతావరణ కిచెన్, కట్టెలతో మండించడం వలన పొగతో చుట్టు పక్కల వారికి శ్వాస సంబంధించిన ఇబ్బందులను గుర్తించారు. అదే విధంగా పుట్ పాత్ రోడ్డును ఆక్రమించి వ్యాపారం చేయడం,120 మైక్రాన్లలోపు ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని తనిఖీలలో గుర్తించారు.

ఈ సందర్భంగా స్వీట్ హౌస్ యజమానికి రూ.11 వేల జరిమాన విధించారు. ఈ తనిఖీలలో కాప్రా సర్కిల్ అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ మధుసూదన్ రావు, శానిటరీ సూపర్ వైజర్ సుదర్శన్ స్థానిక కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి, స్థానిక కాలనీ అసోసియేషన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు ఈ ఆకస్మిక తనిఖీ చేసారు.



# ప్రభుత్వ భూమిలో వెలిసిన నిర్మాణాలను తొలగించాలి




**కుత్బుల్లాపూర్, ఆగస్టు 25, (తెలంగాణ దిశ) :**నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఇందిరమ్మ కాలనీ సమీపంలో గల సర్వే నెంబర్ 233/15 ప్రభుత్వ స్థలంలో నిర్మించిన కట్టడాలను తొలగించాలని మేడ్చల్ మల్కాజిగిరిజిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డికి సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో సిపిఐ నేతలు ఫిర్యాదు చేశారు. స్థానిక ఇందిరమ్మ కాలనీ, మేస్త్రి బ్లాక్ 21, 22 వెనుక ఉన్న ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 233/15 స్థలాన్ని కబ్జా చేస్తూ సర్వే నెంబర్ 274 పత్రాలతో నిర్మాణ అనుమతిని పొందారని వివరించారు. నిజాంపేట గ్రామంలో ప్రభుత్వ స్థలాలలో అక్రమ కట్టడాలని నిర్మిస్తూ ప్రైవేటు స్థలంగా చిత్రీకరిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై బాచుపల్లి తహసిల్దార్, ఆర్ఐ, నిజాంపేట టౌన్ ప్లానింగ్ అధికారులకు ఈ విషయమై అనేకసార్లు ఫిర్యాదు చేసిన అధికారులు పట్టించు కోకుండా కబ్జాదారులకు సహకరిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్, పార్టీ నేతలు ఆశీ, యాదయ్య, పి దస్తగిరి, బి. కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# పరిశోధనా రంగానికి ప్రమాద ఘంటికలు!

ఈ మాట నమ్మశక్యం గానిది. కారణం పరిశోధన లేని వైజ్ఞానిక పురోగతి లేదు. వైజ్ఞానిక అభివృద్ధి లేని సమాజ పురోగమనమూ లేదు. ఈ రంగంలో పోటీపడి ముందు నిలబడలేని దేశాలు ఎంత సంపద,ఎంత సంస్కృతి, ఎంత చరిత్రవున్నా ముందుకుపోలేవు. శాస్త్ర సాంకేతికాభివృద్ధి పైనే ఆధునిక ప్రపంచం నడుస్తోంది. అమెరికా ప్రపంచాధిపత్యం కూడా దీని వల్లనే సాగుతోంది. కానీ ఆశ్చర్యంగా అమెరికా తన పరిశోధనా కార్యక్రమాలకు కత్తెర వేస్తోందట. ఫెడరల్ సైంటిస్టులను ఇంటికి పంపుతున్నారట. జాతీయ ఆరోగ్య సంస్థకు (ఎన్.హెచ్.ఐ) ఏకంగా ఈ సంవత్సరం 8 బిలియన్ డాలర్లు, వచ్చే ఏడు 18 బిలియన్ డాలర్లు కోత పెడుతున్నారట. జాతీయ సైన్సు ఫెడరేషన్ బడ్జెట్లో 5బిలియన్ డాలర్లు తగ్గించేశారట. నాసాకు సైతం 25 శాతం నిధుల కోత పడిందట. ఇక విశ్వవిద్యాలయాల సంగతి సరేసరి. "మీ నిధులు మీరు సమకూర్చుకోండి. దాతల్ని వెతుక్కోండి. మీ పరిశోధనలు సాగించుకోండి" అని ఫెడరల్ ప్రభుత్వం తేల్చి చెప్పేస్తోందట. ఒక్క ఆయుధాల పరిశోధనే దీనికి మినహాయింపు! దీంతో శాస్త్రవేత్తలు అమెరికా నుంచి వలస కట్టేందుకు సిద్ధమవుతున్నారు. 'నేచర్ కెరీర్స్' కథనం ప్రకారం ఏకంగా 32 శాతం యూరపు బాట పడతామంటున్నారు. 'నేచర్ పోల్'లో పాల్గొన్న వారిలో 72 శాతం అగ్ర రాజ్యానికి వీడ్కోలు చెప్పేందుకు సిద్ధమవుతున్నారు.

ఇక యూరపులో చూస్తే అక్కడా నిధులు లేవు. ఎప్పుడూ ఒడిదుడుకులు. జీతాలు తక్కువ. శాస్త్రవేత్తలు తమ పరిశోధనను వదిలేసుకుని ఉన్న ఫళాన ఎక్కడికో వెళ్లిపోలేరు. ఎంత చెడ్డా ఇప్పటికీ అమెరికాదే విజ్ఞానాధిపత్యం గాబట్టి సీనియర్లు అక్కడే ఎలాగో సర్దుకుపోదామనుకుంటున్నారు! ఒకప్పుడు సింగపూర్ మంచి జీతాలిచ్చి, ఉత్తమ వసతులు కల్పించి, గొప్ప దార్శనికతతో శాస్త్రవేత్తల్ని ఆకర్షించింది. అక్కడి మంచి స్కూళ్లు, ఆరోగ్య వ్యవస్థలు, భద్రత, రవాణా, స్వచ్ఛ వాతావరణం కూడా దీనికి తోడ్పడ్డాయి. జర్మనీ నుంచి 1930లలో వందలాది వైజ్ఞానికులు అమెరికా వచ్చారు. కానీ అప్పటి కారణం వేరు. అప్పుడక్కడ వారికి భద్రత లేదు. ప్రస్తుతం కృత్రిమ మేధ, బయో టెక్నాలజీ, సెమీ కండక్టర్స్, అంతరిక్షం, క్వాంటం రంగాల్లో ఎవరిది ఆధిక్యమో వారిదే ప్రపంచాధిపత్యం. దీన్ని "గ్లోబల్ టెక్ పోటీ" అంటున్నారు. ఈ పరుగులో 84.3. పాయింట్లతో అమెరికా అగ్ర భాగాన వుంది. చైనా 65.6 పాయింట్లతో దాని వెంట పరుగిడుతోంది. యూరపు మూడో స్థానంతో సరిపెట్టుకుంది. మిగిలినవి వాటి దరిదాపుల్లో లేవు. మన దేశం 15.2 పాయింట్లతో పదో స్థానంలో వుంటే మనకన్నా రష్యా, కెనడా, ఆస్ట్రేలియా, ఇటలీ, స్పెయిన్లు వెనకబడ్డం విశేషం. "అలాంటప్పుడు అమెరికా యూరపుల నుంచి శాస్త్రవేత్తలు మన దేశానికి వలస వస్తారా" అంటే అలా ఏమీ కనపడ్డం లేదంటారు నోబెల్ అవార్డు గ్రహీత రామకృష్ణన్. కారణం అంతర్జాతీయ ప్రమాణాల పరిశోధనా సంస్థలు మనకు తక్కువ. మన ఐఐఎస్సి, ఎన్సిబిఎస్, టిఐఎఫ్ఆర్, ఐఐఎస్ఇఆర్, ఐఐటి లు లాంటివి ఒక్కొక్కటి ఒకటి రెండు రంగాల్లో అగ్ర భాగాన వుంటే వుండొచ్చు గానీ మొత్తంగా సంస్థలుగా చూస్తే వాటి నాణ్యత ప్రపంచంతో పోటీ పడగలది కాదు. దీర్ఘకాలిక బేసిక్ రీసెర్చ్‌కి అవకాశాలు వుంటేనే అమెరికా నుంచి శాస్త్రవేత్తలు తరలి వస్తారు. ఇందులో మనం అమెరికా చైనా, యూరపులతో తూగలేకున్నాం. ఇక మొదటి 100 అత్యున్నత విశ్వవిద్యాలయాల్లో మనది ఒక్కటీ లేదు. ఇక నిధుల దగ్గరకు వస్తే పరిశోధనా రంగానికి మనం వెచ్చిస్తున్నది జిడిపి లో కేవలం 0.7 శాతం. చైనా వ్యయంతో పోలిస్తే ఇది మూడో వంతు కూడా లేదు. సివిల్ పరిశోధనల్లో ఇజ్రాయిల్ 6.30 శాతం, దక్షిణ కొరియా 4.9 శాతం, జపాన్ 3.3 శాతం, అమెరికా 3.46 శాతం తమ జిడిపి లలో ఖర్చు చేస్తుంటే మనం ఎక్కడో వుండిపొయ్యాం! రామకృష్ణన్ అంతటితో ఆగక మన దేశ పరిశోధనా రంగానికి మౌలిక సదుపాయాలు, నిధులు లేకపోవడంతో పాటు దీర్ఘకాలిక దృక్పథం కూడా లేదంటారు. "ఇచ్చే నిధులు సకాలంలో ఇవ్వరని, స్కాలర్‌షిప్ లు ఎంత కాలానికీ రావని, ఎప్పుడు ఏ విధానాలు వస్తాయో తెలియవని, ప్రోత్సాహాలు ఇచ్చే సంప్రదాయం తక్కువని, రాజకీయాలు ఎక్కువ" అని ఆయన చెప్పుకొస్తారు. జాతీయ పరిశోధనా ఫౌండేషన్‌కు (ఎన్.ఆర్.ఎఫ్) ఆర్భాటంగా 2011లో 50 వేల కోట్లు కేటాయించి, ఐదేళ్లలో కేవలం 14 వేల కోట్లిచ్చి, మిగిలినవి దాతల నుంచి సమీకరించుకోవాలన్న చరిత్ర మనది! ప్రైవేట్ పారిశ్రామికవేత్తలకు తక్షణ లాభాలపై ఉన్న మోజు దీర్ఘకాలిక పరిశోధనా రంగంపై ఎప్పుడూ లేని దేశం మనది! అమెరికా పరిస్థితి దీనికి భిన్నం అంటారాయన. కానీ మన దేశ శాస్త్ర సాంకేతిక శాఖా మంత్రి సైన్సు పత్రాల ప్రచురణలో మనం 2029 నాటికి అమెరికాను అధిగమిస్తున్నామంటున్నారు. ఆయన లెక్క ప్రకారం ప్రస్తుతం (2024) చైనా 8,98,949, అమెరికా 4,57,335 భారత్ 2,07,390 లతో మొదటి మూడు వరుసల్లో వున్నాయి. ప్రపంచ అత్యున్నత శాస్త్రవేత్తల్లో మనవారు 5321 మంది (జపాన్ వారు 5608, జర్మనీ వారు 10,420).కానీ సమస్య ఎక్కడ వస్తోందంటే మన పత్రాలు, పి.హెచ్.డిలు నాసిరకమైనవి. హైదరాబాదులోని ఒఎమ్ఐసిఎస్ గ్రూపునకు అమెరికా నైన్త్ సర్క్యూట్ కోర్టు 50 బిలియన్ డాలర్లు అపరాధం విధించింది. కారణం ఈ గ్రూపు ఏకాఎకి 69,000 పత్రాలు ప్రచురించింది. అన్నీ బోగస్‌వి, దండగ మారినవి. ప్రపంచంలోని ఫేక్ జర్నల్సులో 62 శాతం ఇండియాలోనే వున్నాయంటున్నారు. కనీసం 10 శాతం పి.హెచ్.డి ల సంగతీ ఇంతే! "దీర్ఘకాలిక విధానాలు లేకపోవడం, సైన్సును రాజకీయం చేయడం, అధికారుల పెత్తనం, కాలుష్యభరిత నగరాలూ ఇలా ఎన్ని లోపాలున్నా భారతీయ సైంటిస్టుల, మరీ మన యువ వైజ్ఞానికుల కృషి చాలా గొప్పది! ఉష్ణ మండల వ్యాధుల మీదా, జీవావరణం మీదా మనవాళ్ల కృషి ప్రపంచంలో ఎవ్వరికి తీసి పోదు" అంటారు రామకృష్ణన్. దీన్ని మారుతున్న కాలంలోనూ మన దేశం నిలబెట్టుకోగలదా? అగ్రరాజ్యం పరిశోధనా రంగంలోనూ ప్రపంచాన్ని అస్తవ్యస్తం చేస్తుందా? పరిశోధనలు మందగించాక ప్రపంచ గమనం ఎలా వుంటుంది? ఇవన్నీ ప్రశ్నలు.




## కంగనా రనౌత్ ద్విపాత్రాభినయం..!

న్యూఢిల్లీ, : నటి, ఎంపి కంగనా రనౌత్ ఏ విషయంలో అయినా ముక్కుసూటిగా ఉంటారు. ఎంపిగా ఆమె హిమాచల్ మండి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. నెలసరి సమయంలో ఉండే బాధ, ఇబ్బందులు సామాన్య మహిళలకే కాదు.. సెలబ్రిటీలకు తప్పవన్నారు నటి, ఎంపీ కంగనా రనౌత్. వారు కూడా ఈ సమస్యలకు అతీతం కాదన్నారు. సినీరంగం నుంచి రాజకీయ రంగ ప్రవేశం చేసిన కంగనా తాజాగా ఈ రెండు రంగాలను పోలుస్తూ మహిళగా తాను ఎదుర్కొంటున్న సమస్యను పంచుకున్నారు. ఈ రెండు రంగాలు పూర్తిగా భిన్నమైనవి. ఇండస్ట్రీలో హీరోయిన్స్‌కు కారవాన్‌లు ఉంటాయి. అవుట్‌డోర్ చిత్రీకరణల సమయంలో ప్రత్యేకమైన సదుపాయాలు కూడా చిత్రబృందం ఏర్పాటు చేస్తుంది. దాంతో పీరియడ్స్ సమయంలో మరింత శ్రద్ధ తీసుకునే వీలుంటుంది. వాష్‌రూమ్‌లకు వెళ్లే సదుపాయం ఉంటుంది. విశ్రాంతి కూడా తీసుకోవచ్చు. అవసరం అనుకుంటే టీమ్‌తో చెప్పి మినరల్ వాటర్‌ను కూడా వేడి చేసి ఉపయోగించుకోవచ్చు. కానీ, ఇప్పుడు నేను ఉంటోన్న రంగం పూర్తిగా వేరు. ఒక్కోసారి పర్యటనలో భాగంగా రోజుకు 12 గంటలు ప్రయాణించాల్సి వస్తుంది. కనీసం టాయిలెట్‌కు వెళ్లడానికి కూడా ఉండదు. నాకే కాదు.. ఇతర ఎంపీలకు కూడా ఇదే సమస్య ఉంది. అందరూ అనుకునేంత చిన్న ఇబ్బంది కాదిది. పెద్ద విపత్తుతో పోల్చొచ్చు. దీన్ని వర్ణించడం కూడా అసాధ్యం అని తెలిపారు. తన నటనతో నాలుగు జాతీయ అవార్డులను సొంతం చేసుకున్న ఈ నటి.. 2024లో భాజపా తరపున హిమాచల్‌ప్రదేశ్‌లోని మండీలో ఎంపీగా పోటీ– చేసి విజయం సాధించారు. అమ్మాయిలు వయసులో ఉండి ఏదైనా సాధించాలనే పట్టుదలతో ఉన్నప్పుడు ఒక పెళ్లి అయ్యి పిల్లలు ఉన్న వ్యక్తి మీతో సంబంధం పెట్టుకోవాలని ప్రయత్నిస్తే అది మగవాడి తప్పు కాదు. మీరు పెళ్ళి అయిన వాళ్ళతో సంబంధం పెట్టుకోవడం మీ తప్పు అని జనాలు ఎప్పుడూ మహిళను తప్పుగా చూస్తారు. ఇలాంటి సందర్భాల్లో అమ్మాయి తప్పు చేసినట్లే, మగవాడి తప్పు చేశాడు అని ఎవరు అనుకోరంటూ కంగనా అభిప్రాయపడింది. అలాగే డేటింగ్ యాప్స్ వాడకం గురించి కంగనా మాట్లాడుతూ.. ఇవి సమాజంలో మురికి కాలువ లాంటివని.. ఆత్మవిశ్వాసం లేనివారు, ఎవరో ఒకరి గుర్తింపు కోసం చూసేవాళ్లు మాత్రమే ఇలాంటివి వాడుతారని కంగాన చెప్పుకోచ్చింది. పెద్దలు కుదిర్చిన వివాహం ద్వారా అయిన లేదా చదువుకున్న –టైంలో అయిన అమ్మాయిలు తమ పార్ట్‌నర్‌లను వెతుక్కోవాలని కంగనా సూచించింది.

## బీజేపీని గద్దె దించాలంటూ సీపీఎం మండల కార్యదర్శి ఘాటు కామెంట్స్



**వీపనగండ్ల,తెలంగాణ దిశ :** మండల కేంద్రంలో సీపీఎం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి డి బాల్ రెడ్డి మాట్లాడారు. దేశంలో అధికారంలో ఉన్న బీజేపీ, 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు కల్పించకుండా పార్లమెంట్లో రాజ్యాంగ సవరణ చేయకపోవడం, బీసీల పట్ల వ్యతిరేక భావజాలాన్ని బహిర్గతం చేస్తోందని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన తీర్మానంపై గవర్నర్ వెంటనే సంతకం చేయాలని డిమాండ్ చేశారు. కానీ గవర్నర్ బీజేపీకి తలొగ్గి బిల్లుపై నిర్ణయం తీసుకోవడం లేదని ఆయనవిమర్శించారు. కేంద్ర మంత్రిగా ఉన్న బండి సంజయ్ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయలేం అని చెప్పడం సిగ్గుచేటు అని వెంటనే బండి సంజయ్ బీసీలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రానున్న స్థానిక ఎన్నికల్లో సీపీఎం స్వతంత్రంగా పోటీ చేస్తుం దని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఎం మండల మండల కార్యదర్శి వర్గ సభ్యులు మండ్ల కృష్ణయ్య, మహబూబ్ బాషా, రవి ప్రసాద్, మండల కమిటీ సభ్యులు బాలగౌడ్, కృష్ణయ్య, సిహెచ్ వెంకటయ్య, ఆశన్న,ఈశ్వర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# అమావాస్యకు ఆ పేరు ఎలా వచ్చింది ?



మానవుడు తాను చేసిన పాపుణ్యాల ఆధారంగా నరక స్వర్గ లోకాలు ప్రాప్తిస్తాయి. స్వర్గం చేరటానికి అనేక ద్వారాలు దాటు కుంటూ వెళ్లాలి. కొన్ని మన పుణ్య కార్యాల వలన మన పాపాలను కడుక్కుంటూ స్వర్గం వైపు వెళుతుంటాం. మన మరణం తరువాత ఆత్మ పూర్తిగా స్వర్గాన్ని చేరలేదు. వారి పాపాలు కడగటానికి వారి సంతానం శ్రాద్ధ కర్మాదులు నిర్వహించి వారిని పాప విముక్తులను చేయాలి. దీనికి సంబంధించి మత్స్య పురాణం లో ఓ కథ ఉన్నది. అసలు అమావాస్యకి శ్రాద్ధ కర్మలకు గల సంబంధం వివరించబడింది. ప్రతిమాసంలోను వచ్చే అమావాస్య అన్నా, మహాలయ అమావాస్య అన్నా పితృదేవతలకు ఎంతో ఇష్టమని, ఆ రోజున శ్రాద్ధ కర్మాదులను చేస్తే మంచి ఫలితం ఉంటుందని పెద్దలంతా అంటుంటారు. పితృదేవతలు ఏడుగణాలుగా విభజించపడ్డాయి. వీరిలో మూడు గణాలవారికి ఆకారం ఉండదు. వైరాజులు, అగ్నిష్వాత్తులు, బర్హిషదులు అనేవారికి ఇలా ఆకారం ఉండకపోవడం విశేషం. అలాగే సుఖాలినులు, హవిష్మంతులు, ఆజ్యపులు, సోమపులు అనే నాలుగు గణాలకు ఆకారం ఉంటుంది.

ఈ ఏడుగణాలవారూ ప్రాణులందరిలో అమితమైన సామర్థ్యాన్ని, చైతన్యాన్ని కలిగిస్తుంటారు. అందుకే ఈ పితృదేవతలకు కావల్సిన శ్రాద్ధవిధులను నిర్వర్తించాలని అంటారు. మూర్తి (ఆకారం) లేని పితరులు వైరాజుడు అనే ప్రజాపతి కుమారులు. అందుకే వీరిని వైరాజులు అని అంటారు. ఈ అమృతాలైన పితృగణాలవారు శాశ్వతాలైన లోకాలను పొందగోరి ఓసారి యోగసాధనకు ఉపక్రమించారు. అయితే ఏకాగ్రత లోపించి యోగం కోల్పోతారు. ఈ కారణంగా వీరంతా పితృదేవతలుగా మారారు. ఈ పితృదేవతల మానసపుత్రికే మేన. ఈమె హిమవంతుడిని పెళ్లాడింది. హిమవంతుడికి మైనాకుడు అనే కుమారుడు జన్మించాడు. మైనాకుడికి క్రౌంచుడు జన్మించాడు. ఆ క్రౌంచుడి పేరుమీదనే క్రౌంచద్వీపం ఏర్పడింది. మేనా హిమవంతులకు ముగ్గురు కుమార్తెలు కూడా ఉన్నారు. ఉమ, ఏకపర్ణ, అపర్ణ అని ఆ ముగ్గురు కుమార్తెల పేర్లు. ఆ కన్యలు మంచి యోగసిద్ధి కలవారు. హిమవంతుడు ముగ్గురిలో పెద్దదైన ఉమను రుద్రుడికి, ఏకపర్ణను భృగువుకు, అపర్ణను జైగీషవ్యుడికి ఇచ్చి వివాహం చేశాడు. ఇలా వైరాజ పితృదేవతల సంతతి వృద్ధి చెందింది. సోమపథాలు అనే లోకాలలో మరీచి అనే ప్రజాపతికి జన్మించిన పితృదేవతా గణాలు నివసిస్తుంటాయి. ఈ పితృదేవతలకు ఒక మానస పుత్రిక ఉంది. ఈమె పేరుమీదనే అనంతర కాలంలో అమావాస్య తిథి వచ్చింది. ఈమె జీవనకథనంలో నేటివారికి ఉపయుక్తమయ్యే ఓ సందేశం కూడా ఇమిడివుంది. అగ్నిష్వాత్తుల మానసిక పుత్రిక పేరు అచ్ఛోద. ఆమె నదీరూపంగా ఉండేది. అచ్ఛోదను పితృదేవతలు ఒక సరస్సులో సృష్టించారు. ఓరోజున వారంతా కలిసి ఆమె దగ్గరకు వచ్చారు. ఏదైనా వరం కోరుకోమని తమ కూతురును అడిగారు. అయితే దివ్యపుష్పమాలికలు, దివ్యగంధాలు, మంచి అలంకారాలు చేసుకుని ఎంతో సుందరాకృతిలో ఉన్న మావసుడు అనే ఒక పితరుని చూసి అచ్ఛోద కామపరవశురాలైంది. ఇంద్రియ నిగ్రహాన్ని కోల్పోయి తండ్రి అయిన మావసుడినే కోరిన కారణంగా ఆమె అప్పటిదాకా సంపాదించిన యోగశక్తిఅంతా నశించింది. దాంతో ఆమె తన దివ్యత్వాన్ని కోల్పోయింది. అసంబద్ధంగా ఇంద్రియ నిగ్రహాన్ని కోల్పోయి ప్రవర్తించినందువల్లనే ఆమెకు ఇంతటి నష్టం ప్రాప్తించింది. పితృదేవతలు అచ్ఛోద తమకు ఎంతో అభిమానపాత్రురాలైన మానసపుత్రికే అయినా ధర్మాన్ని అనుసరించి శిక్ష విధించడంలో అంటే ఆమెకు దివ్యత్వం నశించాలని శపించడంలో వెనుకాడలేదు. మావసుడు మాత్రం అచ్ఛోదను కామించక ఇంద్రియ నిగ్రహంతోనే ప్రవర్తిం చాడు. అచ్ఛోద మావస్య కాలేదు. అంటే మావసుడికి ప్రియురాలు కాలేదు. అందుకే ఆమె అమావస్య అయింది. అమావస్య అంటే మావసుడికి ప్రియురాలు కానిది అనేది ఇక్కడి అర్థం. అలా తదనంతర కాలంలో అచ్ఛోదకే అమావాస్య అనే పేరు ప్రాప్తించిం ది. ఈమె అంటే పితృదేవతలకు ఎంతో ప్రాణం. తమ మానస పుత్రిక మీద ఉండే మమకారంతో అచ్ఛోద అమావస్య (అమావాస్య తిథి) అయిన రోజున తమకు ఎవరైనా అర్పించిన శ్రాద్ధానికి అనంత ఫలితాన్ని ఆనాటి నుంచి పితృదేవతలు ఇస్తూ వచ్చారు.

# కాళేశ్వరం ప్రాజెక్టును పేల్చే కుట్ర చేశారు..: ఆర్ఎస్

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** తెలంగాణ వరప్రదాయిని కాళేశ్వరం ప్రాజెక్టును పేల్చే కుట్ర చేశారని బీఆర్ఎస్ సీనియర్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కుట్ర వెనుక కాంగ్రెస్, బీజేపీ ఉన్నాయని ఆర్ఎస్పీ ఆరోపించారు. తెంగాణ భవన్‌లో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ.. మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోవడం పట్ల సంచలన ఆధారాలను ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ బయటపెట్టారు. 2023వ సంవత్సరం అక్టోబర్ 21వ తేదీన సాయంత్రం 6:20 గంటలకు, మేడిగడ్డ పిల్లర్ల వద్ద భారీ శబ్దాలు వచ్చాయని మేడిగడ్డ అసిస్టెంట్ ఇంజనీర్ రవికాంత్ పేర్కొన్నారు. ఈ మేరకు 2023 సంవత్సరం అక్టోబర్ 22వ తేదీన మహదేవ్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో అసిస్టెంట్ ఇంజనీర్ ఫిర్యాదు చేశారు. ఇంతవరకు ఆ ఎఫ్ఐఆర్ పట్ల చర్యలు ఎందుకు తీసుకోలేదు? అని ఆర్ఎస్పీ నిలదీశారు. కాళేశ్వరం ప్రాజెక్టును పేల్చే కుట్ర చేశారు. ప్రాజెక్టు పిల్లర్‌కు పగుళ్లు రావు.. క్రస్ట్ గేట్లకు వస్తే రావొచ్చేమో. ఇంటి నిర్మాణానికి సంబంధించిన పిల్లర్లకు కూడా పగుళ్లు రావు.. ఉష్ణోగ్రత తేడాతో గోడలకు పగుళ్లు వస్తాయి కానీ కాళేశ్వరం ప్రాజెక్టులోని ఒక్కటే 20వ నెంబర్ పిల్లర్‌కి క్రాక్ వచ్చిందంటే, కచ్చితంగా బ్లాస్ట్ జరిగిందనే అనుమానాలు ఉన్నాయని ఆర్ఎస్పీ అనుమానం వ్యక్తం చేశారు. అసలు ఏమాత్రం వరద లేని సమయంలో మేడిగడ్డ బ్యారేజీ ఎలా కుంగిపోయింది.. అది కూడా ఒక్క పిల్లరే ఎలా కుంగిపోతుంది. 2022లో రికార్డు స్థాయిలో వరదలు వచ్చినా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ళ బ్యారేజీలు తట్టుకున్నాయి. మేడిగడ్డలో ఒక్క పిల్లర్ మాత్రమే ఎందుకు కుంగిపోయింది. కిషన్ రెడ్డి లేఖ రాయగానే ఎన్‌డీఎస్‌ఏ వచ్చింది. ఉత్తరాఖండ్‌లో మొత్తం డ్యామ్ కొట్టుకునిపోతే ఎందుకు ఎన్డీఎస్ఏ అక్కడికు వెళ్ళలేదు. మేడిగడ్డ వద్ద పేలుళ్ల శబ్దాలపై ఎన్డీఎస్ఏ ఎందుకు మాట్లాడటంలేదు. మహదేవ్‌పూర్ పోలీసులు వెంటనే విచారణ చేసి ఉండాలి.అసాంఘిక శక్తులు రేవంత్ రెడ్డి,బండి సంజయ్, కిషన్ రెడ్డి ఇంకా ఎవరైనా అనేది తేల్చాలి. ఈ ముగ్గురి మొబైల్ ఫోన్స్ డేటాచెక్ చేస్తే వెంటనే దొరికేవాళ్ళు . భూపాలపల్లి పోలీసులు అప్పుడు వెంటనే పిల్లర్ల శాంపిల్స్,భూమి శాంపిల్, అక్కడ ఉండే మీటర్ రీడింగ్స్, సిస్మిక్ డేటా, కాల్ డీటెయిల్స్ తీసుకొని ఉండాల్సింది అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌సూచించారు. పిల్లర్లకుఎక్కడా క్రాక్ రాదని ఇంజనీరింగ్ నిపు ణులు చెప్తున్నారు. దీని వెనుక రేవంత్ రెడ్డి, బండి సంజయ్, కిషన్ రెడ్డి ఉన్నారా లేదా అనేది సిట్ ఏర్పాటు చేసి తేల్చాలి. అసలుఅక్కడ చిన్నస్థాయిలో ఏమైనా భూకంపాలు వచ్చాయా లేదా అనేది తేల్చాలి. పేలుళ్ల కోణంలో ఎందుకు విచారణ జరగలేదు.

# ఒకే కుటుంబంలో ఐదుగురికి ఇందిరమ్మ ఇళ్లు?



**ఖమ్మం,తెలంగాణ దిశ :** తెలంగాణ ప్రభుత్వం పేదల కోసం ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు కోసం అధికారులు ఎంత కఠిన చర్యలు తీసుకుంటున్నా.. అక్కడక్కడ అవకతవకలు వెలుగు చూస్తూనే ఉన్నాయి. తాజాగా ఖమ్మం జిల్లాలో ఒకే కుటుంబానికి ఐదు ఇళ్లు మంజూరు కావడం వివాదాస్పదమైంది. దీనిపై స్థానికులు ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడా అనర్హులకు ఇళ్లు మంజూరు కావడంతో 1950 ఇళ్లను అధికారులు రద్దు చేసిన సంగతి తెలిసిందే.తెలంగాణ ప్రభుత్వం పేదల సొంతింటి కల సాకారం కోసం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించిన సంగతి తెలిసిందే. తొలి విడతలో భాగంగా ప్రతి నియోజకవర్గం నుంచి 3,500 మంది అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లను కేటాయించారు. ప్రస్తుతం ఈ ఇళ్లన్నీ నిర్మాణ దశలో ఉన్నాయి. వీలైనంత వరకు పెద్ద సంఖ్యలో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి.. ఆగస్టు 15 నాటికి పెద్ద ఎత్తున గృహప్రవేశం కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియలో అధికారులు చాలా అప్రమత్తంగా ఉంటున్నారు. 360 డిగ్రీలో అభ్యర్థుల వివరాలను పూర్తి స్థాయిలో పరిశీలించిన తర్వాతే.. అర్హులుగా తేలిన వారిని ఎంపిక చేసి వారికి ఇళ్లు కేటాయిస్తున్నారు. అయితే అధికారులు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా కొన్ని చోట్ల అనర్హులకు ఇళ్లు మంజూరవుతున్నాయి. తాజాగా ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఓ వార్త సంచలనంగా మారింది. ఒకే కుటుంబంలో ఐదుగురికి ఇందిరమ్మ ఇళ్లు కేటాయించారనే వార్తపై పెద్ద ఎత్తున ఆందోళన వ్యక్తం అవుతోంది. ఆ వివరాలు..ఖమ్మం జిల్లాలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారనే వార్త సంచలనంగా మారింది. ఖమ్మం 8వ డివిజన్ వైఎస్సార్ నగర్ కాలనీలో నివాసం ఉంటున్న ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురికి ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ తొలి విడతలో ఇళ్లు మంజూరైనట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. దీనిపై స్థానికులు మున్సిపల్ అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా లాభం లేదని.. అధికారులు దీనిపై స్పందిచడం లేదని.. తగిన చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఎవరైనా దీనిపై స్పందించి విచారణ చేపట్టాలని.. నిజమైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యేలా చూడాలని డిమాండ్ చేస్తున్నారు.ఇదిలా ఉంటే కొన్ని రోజుల క్రితం హౌసింగ్ వెరిఫికేషన్ అధికారులు 1950 మందికి మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లను రద్దు చేసిన సంగతి తెలిసిందే. హౌసింగ్ వెరిఫికేషన్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో సుమారు 1,950 మంది అనర్హులకు ఇళ్లు మంజూరు చేసినట్లు గుర్తించారు. దీంతో అధికారుల వారి ఇళ్లను రద్దు చేశారు. మరోవైపు శాఖపరమైన చర్యలకు సిద్ధమవుతున్నారు అధికారులు. వీరందరికి గతంలోనే ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని.. అప్పుడు నిర్మాణం చేపట్టలేదని అధికారులు తెలిపారు.తొలి విడత రూ.లక్ష చెల్లించే సమయంలో వీరి గురించి తెలిసిందని.. అందుకే వెంటనే వీరికి కేటాయించిన ఇళ్లను రద్దు చేసి వారి స్థానంలో అర్హులైన కొత్త వారికి అవకాశం కల్పించాలని ఆదేశాలు జారీ చేశారు. మరి ఇప్పుడు ఒకే కుటుంబంలోమ 5గురు ఇందిరమ్మ ఇళ్లను పొందారన్న దానిపై అధికారులు ఎలా స్పందిస్తారో చూడాలి అంటున్నారు.

# రూట్ మార్చిన సైబర్ నేరగాళ్లు

# ‘జంప్ డిపాజిట్’ పేరుతో మోసం



**హైదరాబాద్,తెలంగాణ దిశ:** సైబర్ నేరగాళ్లు రూట్ మార్చుతున్నారు. ఇప్పుడు కొత్తగా ‘రీఫండ్ క్యాష్ బ్యాక్’ పేరుతో డబ్బులను కొట్టేస్తున్నారు. ఏపీకే ఫైల్స్ ను పంపించి బ్యాంక్ ఖాతాను ఖాళీ చేస్తున్నారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే వాటిలో ఈ తరహా మోసాలపై 80 శాతం ఫిర్యాదులు ఉంటున్నాయని పోలీసులు చెబుతున్నారు. యూపీఐ(యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్ఫేస్) చెల్లింపుల్లో ప్రపంచంలోనే భారత్ అగ్రస్థానంలో ఉంది. ప్రతినెలా రూ.1800 కోట్లకు పైగా లావాదేవీలు జరుగుతున్నాయని ఇంటర్ నేషనల్ మానిటరీ ఫండ్(ఎంఎంఎఫ్) సంస్థ తన నివేదికలో వెల్లడించింది. ప్రపంచంలో రియల్ టైమ్ డిజిటల్ చెల్లింపుల్లోనూ 50శాతం ఒక్క మన దేశంలోనే కొనసాగుతున్నాయని నివేదికలు చెబుతున్నాయి. ఇంత పెద్దమొత్తంలో లావాదేవీలు జరుగుతున్నందు వల్ల సైబర్ నేరగాళ్లు భారత్ ను ఎంచుకుంటున్నట్లు తెలుస్తున్నది.

**జంప్ డిపాజిట్ ఏమిటి?:** యూపీఐ యాప్‌లో డబ్బులు వచ్చాయని మెసేజ్ వస్తుంది. మనం చెక్ చేసుకోగానే మన బ్యాంకు ఖాతా ఖాళీ అవుతుంది. వాస్తవానికి వాళ్లు పంపించేది మనీ రిక్వెస్ట్ మెసేజ్ మాత్రమేనని సైబర్ సెక్యూరిటీ బ్యూరో తెలిపింది. ఇలా డబ్బుల వచ్చాయని మెసేజ్ లేదా సూచనలు రాగానే బ్యాలెన్స్ చెక్ చేసుకోవద్దని అధికారులు సూచిస్తున్నారు. బ్యాలెన్స్ చెకింగ్ కోసం యూపీఐ పిన్ ఎంటర్ చేయగానే డబ్బులు మన ఖాతాలో నుంచి అవతలి వ్యక్తులకు పోతాయని అధికారులు చెబుతున్నారు. ఇలాంటి ఘటనలపై ఇప్పటికే పలు ఫిర్యాదులు అందినట్లు సైబర్ బ్యూరో అధికారులు వెల్లడించారు. గోల్డెన్ అవర్ చాలా ముఖ్యం: సైబర్ క్రైమ్ లో మోసపోయిన వెంటనే సైబర్ సెక్యూరిటీ బ్యూరోను సంప్రదించాలని సంబంధిత అధికారులు సూచిస్తున్నారు. ఏదైనా లావాదేవీలోమోసం జరిగిందనిభావిస్తే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలని చెబుతున్నారు. గోల్డెన్ అవర్ అనేది చాలాముఖ్యమని, ఫిర్యాదు వెంటనే చేసినట్లయితే లావాదేవీలు జరిగిన అకౌంట్లు గుర్తించి వెంటనే ఫ్రీజ్‌చేయొచ్చని సైబర్‌బ్యూరో వెల్లడించింది. **కంబోడియా వేదికగా...:** సైబర్ క్రైమ్ నేరాల్లో 70 శాతం కంబోడియా వేదికగా జరుగుతున్నాయని, తర్వాత దుబాయ్, చైనా దేశాల్లో జరుగుతున్నట్లు నేషనల్ సైబర్ క్రైమ్ గుర్తించింది. సైబర్ నేరగాళ్లు విదేశాల నుంచి ఏపీకే ఫైల్స్ ను పంపిస్తూ ఫోన్లను హ్యాక్ చేస్తున్నారు. ట్రేడింగ్ యాప్ పెట్టుబడి మోసాలు, లోన్ యాప్ ఇంకా పలు విధాలుగా బ్యాంకు ఖాతాలను ఖాళీ చేస్తున్నారు. ఈ తరహా లోనే ఇప్పుడు కొత్తగా జంప్ డిపాజిట్ చేరింది. మనీ రిక్వెస్ట్ యూపీఐ కి మెసేజ్ పంపించి డబ్బును లూటీ చేస్తున్నారు. ఈ తరహా మోసాలపై జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

# గ్రామాల్లో యూరియా కష్టాలు..?

**మెదక్,,తెలంగాణ దిశ :** పంటల సాగు ప్రారంభం నుంచే రైతులు ఎరువుల కోసం పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. యూరియా కోసం రైతులు పడుతున్న కష్టాలు ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నాయి. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం పాలమాకుల సహకార కేంద్రం వద్ద యూరియా కోసం రైతులు ప్రతి రోజు భారీగా సంఖ్యలో బారులు తీరుతున్నారు.నంగునూరు మండలంలో గత వానాకాలంలో 25,878 ఎకరాల్లో సాగు చేయగా, అప్పట్లో 2600 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అయ్యింది. కానీ, ఈసారి 25,750 ఎకరాలకు సాగు అంచనా వేసి, 1800 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని వ్యవసాయ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. అయితే, ఇప్పటివరకు కేవలం 1100 మెట్రిక్ టన్నులు మాత్రమే నంగునూరు మండల కేంద్రానికి సరఫరా అయ్యింది.యూరియా సరఫరాలో ఎంత జాప్యం జరుగుతోందో స్పష్టమవుతోంది. రైతులకు సరిపడా యూరియాను సకాలంలో అందించకుండా, నిబంధనలతో ఇబ్బందులకు గురిచేయడంపై రైతులు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు.నంగునూరు మండలంలో రైతులు యూరియా కోసం పడుతున్న పాట్లు జిల్లాలో చర్చనీయాంశంగా మారాయి. గతంలో యూరియా పంపిణీ ఇంతటి గందరగోళానికి దారితీయలేదని రైతులు గుర్తు చేసుకుంటున్నారు. నాటి కేసీఆర్ ప్రభుత్వం రైతుల అవసరాలను గుర్తించి, యూరియాను నేరుగా ఇంటికే సరఫరా చేసేదని, ఇప్పుడు అలాంటి పరిస్థితులు లేకపోవడంపై రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.యూరియా పంపిణీలో ప్రభుత్వం ఓటీపీ విధానం మాకు తలనొప్పిగా మారింది. బస్తాలు మాకు నేరుగా ఇవ్వకుండా, ఓటీపీ విధానం ద్వారా ఇస్తున్నారు. ఒక్కరికి సుమారు 20 నిమిషాల సమయం పడుతుంది. చాలా సందర్భాల్లో సర్వర్ పనిచేయకపోవడం వల్ల గంటల తరబడి ఎదురుచూడాల్సి వస్తుంది. ఓటిపి విధానం తక్షణమే రద్దు చేయాలి. పిల్లి కలవ్వ, రైతు, కోనాయిపల్లి.: గడిచిన 10 సంవత్సరాలలో పొలం పనులు వదిలి ఎరువుల కోసం పరుగులు పెట్టాల్సిన అవసరం ఉండేది కాదు. ఏ ఇబ్బంది లేకుండా సకాలంలో యూరియా దొరికేది, అందుకే పంటలు కూడా మంచిగ పండేవి. యూరియా మస్తుగ దొరికేది. ఇప్పుడు ఎరువుల కోసం ఎంత తిరిగినా దొరకతలేవు. నాటి ప్రభుత్వం మంచిగ చేసేది, ఇప్పుడైతే మమ్మల్ని మస్తు బాధ పెడుతున్నారు.యూరియా దళారులకు చేరొద్దని ఉద్దేశంతో ఓటీపీ విధానం ప్రభుత్వం అమలు చేసింది. ఈసారి అగ్రికల్చర్ కి మాత్రమే 1800 మెట్రిక్ టన్నుల యూరియా నివేదిక పంపించాం. మండలం లో ప్రస్తుతానికి వరి 18,500 ఎకరాల్లో సాగు చేశారు.రైతులు యూరియా వినియోగంపై స్పష్టమైన సమాచారం కోసం ఒక పాస్ బుక్కు రెండు యూరియా సంచులు మాత్రమే ఇవ్వాలని ఆదేశాలున్నాయి. యూరియా ఏ రోజు వస్తుందని ఒక రోజు ముందస్తుగానే రైతులకు సమాచారం అందిస్తున్నాము. యూరియా నిల్వ లేకుండా రైతులకు వెంటనే సరఫరా చేస్తున్నాము.

# తమిళనాడులో తారాస్థాయికి భాష రగడ

చెన్నై: మనదేశంలో రాజకీయ నాయకులు మాత్రమే కాదు గవర్నర్లకు కూడా రాజకీయ వాసనలు ఉంటాయి. గవర్నర్లను కేంద్ర ప్రభుత్వం నియమిస్తుంది. రాష్ట్రాలలో జరుగుతున్న పరిస్థితులను ఎప్పటికప్పుడు తమకు నివేదికల ద్వారా తెలియజేయాలని సూచిస్తుంది. అయితే గవర్నర్లు కొన్ని సందర్భాలలో తమ పరిధులు దాటుతుంటారు. రాష్ట్రానికి ప్రధాన పౌరులం అనే విషయాన్ని మర్చిపోయి.. రాజకీయాలలో వేలు పెడుతుంటారు. దీంతో పరిస్థితులు ఒక్కసారిగా చేయు దాటిపోతుంటాయి. గతంలో తెలంగాణ రాష్ట్రంలో కెసిఆర్, తమిళ సై సౌందరరాజన్ మధ్య కొద్ది రోజులపాటు ఇటువంటి పరిణామాలు జరిగాయి. ఇప్పుడు తమిళనాడులో కూడా అటువంటి పరిస్థితులు నెలకొన్నాయి.తమిళనాడు రాష్ట్రంలో డిఎంకె పార్టీ అధికారంలో ఉంది. స్టాలిన్ ముఖ్యమంత్రిగా వ్యవహరిస్తున్నారు. ఆ రాష్ట్రంలో ఆర్ఎన్ రవి గవర్నర్ గా కొనసాగుతున్నారు. రవి తమిళ భాషను వ్యతిరేకిస్తారని ఆ రాష్ట్ర ప్రజలు ముఖ్యంగా డీఎంకే కార్యకర్తలు తీవ్రస్థాయిలో విమర్శిస్తుంటారు. అంతేకాదు ఆయన సమయం దొరికిన ప్రతి సందర్భంలోనూ హిందీ లేదా ఇంగ్లీషులోనే ప్రసంగిస్తుంటారు. సహజంగానే మాతృభాష మీద విపరీతమైన ప్రేమ ఉండే తమిళులు గవర్నర్ వైఖరిని విపరీతంగా విమర్శిస్తుంటారు. సోషల్ మీడియాలో అయితే గవర్నర్ రవిని ఏకిపారేస్తుంటారు. కొంతకాలంగా గవర్నర్, డీఎంకే ప్రభుత్వానికి మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి. నీట్ కు వ్యతిరేకంగా డీఎంకే ప్రభుత్వం ఒక తీర్మానం చేసినప్పుడు.. దానిని గవర్నర్ వ్యతిరేకించారు. అప్పట్లో ఇది తమిళనాడు రాష్ట్రంలో సంచలనం సృష్టించింది.తాజాగా ఆ రాష్ట్ర ప్రథమ పౌరుడికి ఓ యూనివర్సిటీ స్నాతకోత్సవంలో చేదు అనుభవం ఎదురయింది.. డీఎంకే నేత భార్య జీన్ జోసెఫ్ అత్యున్నత విద్యను పూర్తి చేశారు. గవర్నర్ నుంచి డిగ్రీ పట్టా తీసుకోవడానికి ఆమె నిరాకరించారు. వేదిక మీద ఉన్న ఆయనను పట్టించుకోకుండానే వెళ్లి.. వైస్ ఛాన్స్ లర్ చేతుల మీదుగా పట్టా తీసుకున్నారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తోంది. డీఎంకే నేత భార్య వ్యవహరించిన తీరును బిజెపి నాయకులు తప్పు పడుతుండగా.. తమిళనాడు ఆత్మాభిమానాన్ని జీన్ జోసెఫ్ ప్రదర్శించారని డిఎంకె కార్యకర్తలు అంటున్నారు.. ఆమెను తమిళ విప్లవ నాయకిగా అభివర్ణిస్తున్నారు.తమిళనాడులో భాష రాజకీయాలు ఇదే తొలిసారి కాదు. కానీ ఇప్పుడు అవి తారస్థాయికి చేరిపోయాయి. అధికార డిఎంకె కేంద్రంపై తీవ్రస్థాయిలో విమర్శలుచేస్తోంది. హిందీని బలవంతంగా రుద్దుతున్నారని ఆరోపిస్తోంది. గతంలో ఉన్న కేంద్ర ప్రభుత్వాలు ఇలా చేయడం వల్లే ఉద్యమాలు వచ్చాయని.. ఇప్పుడు కేంద్రం కూడా అదే ధోరణి కొనసాగిస్తున్న నేపథ్యంలో.. ఉద్యమాలు మొదలవుతున్నాయని డీఎంకే నేతలు చెబుతున్నారు. మరోవైపు హిందీని తాము బలవంతంగా రుద్దడం లేదని, లేనిపోని గొడవలు సృష్టించి ఎన్నికల్లో లబ్ధి పొందాలని డీఎంకే నేతలు భావిస్తున్నారని బిజెపి నాయకులు చెబుతున్నారు.

## భాగ్యనగరంలో ట్రాఫిక్ కష్టాలకు

# చెక్



**హైదరాబాద్,తెలంగాణ దిశ :** భాగ్యనగరంలో పార్కింగ్ కష్టాలకు చెక్.. మీరు వింటుంది నిజమే..! మహానగరం నడిబొడ్డున ఉన్న నాంపల్లిలో పార్కింగ్ కోసం ఇక మీదట ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవతో అత్యాధునిక మల్టీ లెవెల్ పార్కింగ్ కాంప్లెక్స్ అందుబాటులోకి రాబోతుంది. దీంతో సెంట్రల్ సిటీలో పార్కింగ్ కష్టాలకు ఫులిస్టాప్ పడ్డట్టే..! ఇంతకీ ఏంటి ఆ మల్టీ లెవెల్ పార్కింగ్ కాంప్లెక్స్? అక్కడ ఎన్ని కార్లు పార్కింగ్ చేసుకోవచ్చు?భాగ్యనగరంలో పార్కింగ్ కష్టాలకు చెక్.. మీరు వింటుంది నిజమే..! మహానగరం నడిబొడ్డున ఉన్న నాంపల్లిలో పార్కింగ్ కోసం ఇక మీదట ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవతో అత్యాధునిక మల్టీ లెవెల్ పార్కింగ్ కాంప్లెక్స్ అందుబాటులోకి రాబోతుంది. దీంతో సెంట్రల్ సిటీలో పార్కింగ్ కష్టాలకు ఫులిస్టాప్ పడ్డట్టే..! ఇంతకీ ఏంటి ఆ మల్టీ లెవెల్ పార్కింగ్ కాంప్లెక్స్? అక్కడ ఎన్ని కార్లు పార్కింగ్ చేసుకోవచ్చు? ఇందులో కొత్తదనం ఏముంది? తెలుసుకుందాం.హైదరాబాద్ మహానగర వాసులను నిత్యం వేధిస్తున్న వాహనాల పార్కింగ్ సమస్యను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పూర్తి ఆటోమేటెడ్, కంప్యూటరైజ్డ్ మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ కాంప్లెక్స్‌కు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే పనులు దాదాపు పూర్తి అయ్యాయి. నాంపల్లి మెట్రో స్టేషన్ సమీపంలో పబ్లిక్ అండ్ ప్రైవేట్ భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్టును చేపట్టారు. కొన్ని కారణాల వల్ల ఈ ప్రాజెక్టు నిర్మాణం ఆలస్యం అయినా ఎట్టకేలకు పూర్తి అయింది.మహానగర వాసులను వేధిస్తున్న పార్కింగ్ సమస్యను అధిగమించేందుకు నాంపల్లి మెట్రో రైల్ స్టేషన్ సమీపంలో ఉన్న హెచ్ఎంఆర్‌కు చెందిన అర ఎకరం స్థలంలో 15అంతస్తులలో ఈకాంప్లెక్స్ నిర్మాణం జరిగింది. ఇందులో 10 అంతస్తుల్లో వాహనాల పార్కింగ్ సౌకర్యం.. మరో ఐదు అంతస్తుల్లో కమర్షియల్ షాపులు, రెండు స్క్రీన్‌లతో కూడిన థియేటర్ కూడా నిర్మించారు. పబ్లిక్, ప్రైవేట్ విధానంలో దాదాపు రూ. 100కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టుని నిర్మాణం జరిగింది.

అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో

దేశంలోనే తొలిసారిగా జర్మన్ పాలిస్ పార్కింగ్ విధానంలో, తక్కువ స్థలంలో ఎక్కువ వాహనాలు పార్కింగ్ చేసేలా ఈ ప్రాజెక్టును చేపట్టినట్టు మెట్రో ఎండీ ఔమా రెడ్డి వివరించారు.ఈ కాంప్లెక్స్‌లో మొత్తం 15 అంతస్తులు ఉంటాయి. ఇందులో 3 బేస్‌మెంట్లు, 7 పైఅంతస్తులు కలిపి మొత్తం 10 అంతస్తుల్లో పార్కింగ్ సదుపాయం ఉంటుంది.

మరో 5 అంతస్తులను కమర్షియల్ పర్పస్ కేటాయించారు. ఈ పార్కింగ్ కాంప్లెక్స్‌లో అన్ని రకాల సదుపాయాలు కలిగిన రెండు సినీ థియేటర్‌లను కూడా ఏర్పాటు చేశారు. 11వ అంతస్తులో నగర వీక్షణ కోసం గ్యాలరీని ఏర్పాటు చేశారు. మొత్తం 10 పార్కింగ్ అంతస్తుల్లో 200 పైగా కార్లు, 200 వరకు టూ వీలర్ పార్కింగ్ చేయవచ్చని, ఈ ప్రాజెక్టు ద్వారా నగర ప్రజలకు ప్రపంచ స్థాయి పార్కింగ్ అనుభవం అందించనున్నామని అధికారులు అంటున్నారు.

# మంథని చైతన్యపురి కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించండి

## –మంథని బిజెపి నాయకులు



**మంథని,తెలంగాణ దిశ :** మంథని మున్సిపల్ పరిధిలోని చైతన్యపురి కాలనీలో నెలకొన్న సమస్యలను మున్సిపల్ అధికారులు వెంటనే పరిష్కరించాలని మంథని పట్టణ బిజెపి నాయకులు డిమాండ్ చేశారు. శనివారం చైతన్యపురి కాలనీలో భారతీయ జనతా పార్టీ నాయకులు సందర్శించి ప్రజలతో మమేకమై అక్కడ ఉన్నటువంటి సమస్యలను అడిగి తెలుసుకోన్నారు .ఇక్కడ పరిస్థితులను చూస్తే అధికారులు కేవలం రోడ్లను మాత్రమే నిర్మించి డ్రైనేజీ నిర్మాణాలు పూర్తిగా మరిచిపోయారని వారు విమర్శించారు.

ఈ కాలనీలో 90శాతం ఇండ్లకు డ్రైనేజీ వ్యవస్థ లేదని చెప్పుకోవడానికి సిగ్గుచేటుగా ఉందన్నారు. ఈ వర్షాకాలంలో చిన్నపాటి వర్షానికే మురికి నీరు రోడ్లపైన ప్రవహిస్తున్నటువంటి దృశ్యాలు అడుగడుగునా కనిపిస్తున్నాయన్నారు. ప్రతి ఇంటి చుట్టూ చెరువులను తలపించేలా నీళ్లు చేరి దోమలతో, ఈగలతో, పిచ్చి చెట్లతో అత్యంత దారుణంగా పరిస్థితులు ఇక్కడ నెలకొని ఉన్నాయన్నారు. ప్రజానీకం విష జ్వరాల పాలవుతున్నారని, స్కూల్ పిల్లలు సైతం ఈ మురికి నీరు ప్రవహిస్తున్న రోడ్డుపై నుండి స్కూళ్లకు వెళ్తున్నారని ఇంత దారుణ పరిస్థితులు ఉన్నా ఏ నాయకుడు గాని ఏ అధికారి గాని వీళ్ళ వద్దకు వచ్చిన వారు లేరని,సమస్యలను తెలుసుకున్న వారు లేరని వారు విమర్శించారు. వెంటనే మున్సిపల్ అధికారులు స్పందించి ఈ కాలనీ సమస్యలను పరిష్కరించాలన్నారు.లేని పక్షంలో స్థానిక సంస్థల

ఎలక్షన్లు కొద్ది రోజుల్లోనే జరగనున్నాయని గుర్తు చేస్తూ మీ వల్ల కానీఈ పనిని భారతీయ జనతా పార్టీ ఈఎలక్షన్లలో గెలిచి ఈ పనులన్నీ చేసి చూపిస్తుందని ప్రజలకు హామీ ఇచ్చారు. బిజెపి నాయకులు ఈసంపల్లి కొమురయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మంథని పట్టణ బిజెపి అధ్యక్షులు సబ్బని సంతోష్, పట్టణ ప్రధాన కార్యదర్శి సామల అశోక్, పట్టణ కార్యదర్శి పార్వతీ విష్ణు మరియు స్థానిక చైతన్యపురి కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

# మరో 6 నెలలు పొడిగింపు

**కరీంనగర్,తెలంగాణ దిశ :** ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల పొడగించిన పదవీకాలం గురువారంతో ముగిసింది. ప్రభుత్వం మరోమారు ఆరు నెలలపాటు పొడగిస్తూ జీవో ఎంఎస్ నెం. 836ను జారీ చేసింది. కరీంనగర్ సహకార కేంద్ర బ్యాంకు పరిధిలో ఉన్న నాలుగు జిల్లాల్లోని 131 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల పదవీకాలం మరో ఆరు నెలలు కొనసాగుతుంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 131 పీఏసీఎస్లకు 2020 ఫిబ్రవరి 12న ఎన్నికలు జరిగాయి.ఆ తర్వాత సహకార సొసైటీల పాలకవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. వీటి ఐదేళ్ల గడువు ఈ సంవత్సరం ఫిబ్రవరి 13న ముగియగా, ప్రభుత్వం ఎన్నికలకు వెళ్లకుండా ఆరు నెలల పదవీకాలం పొడగించింది. ఈ ఆరు నెలల పదవీకాలం గురువారం ముగియగా మరోమారు పొడగించడంతో సహకార సంఘాల ఎన్నికలను ప్రభుత్వం ఇప్పట్లో నిర్వహించే ఆలోచనలో లేనట్లు స్పష్టమయింది. కరీంనగర్ జిల్లాలో 30, జగిత్యాల జిల్లాలో 51, రాజన్న సిరిసిల్లలో 22, పెద్దపల్లి జిల్లాలో 28 పిఏసిఎస్ లు ఉన్నాయిజిల్లాల పునర్విభజన అనంతరం కూడా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఉమ్మడి జిల్లా పరిధిలో కొనసాగుతుంది. జిల్లా పరిషత్, మండల పరిషత్ ల విభజన జరిగింది కానీ, అప్పటి ప్రభుత్వం ఆర్బీఐ నుండి ప్రత్యేక చట్టం తీసుకురాకపోవడంతో ఉమ్మడి జిల్లా పరిధిలోనే నేటికి కొనసాగుతూ వస్తుంది. అయితే సొసైటీల బలోపేతం, సహకార సంఘాల వ్యవస్థ పటిష్టతకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారించిన నేపథ్యంలో ఎన్నికలు ఇప్పుడే నిర్వహించే ఆలోచన చేయకుండా పదవీకాలం పొడగించింది. ఈ పదవీకాలం పొడగింపు ద్వారా గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఉన్న ఎక్కువ మంది పీఏసీఎస్ చైర్మన్లు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు డైరెక్టర్ల పదవులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా వారే కొనసాగనున్నారు.కరీంనగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అధ్యక్షునిగా బీఆర్ఎస్ పార్టీకి చెందిన గంభీరావుపేట ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్ కొండూరి రవీందర్ రావు కొనసాగుతున్నారు. ఆయన బీఆర్ఎస్ హయాంలో టెస్కాబ్ తెలంగాణ సహకార సంఘం అధ్యక్షనిగా కొనసాగారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్దిరోజులు కొనసాగిన అనంతరం ఆయనపై అవిశ్వాసానికి టెస్కాబ్ డైరెక్టర్లు సిద్ధం కావడంతో ఆయన ఆ పదవికి రాజీనామా చేశారు. ఆయన ప్రస్తుతం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అధ్యక్షునిగా సేవలు కొనసాగిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి ఉన్నప్పటికి ప్రభుత్వ ఉత్తర్వు ద్వారా ఆయనకు మరో ఆరు నెలలు చైర్మన్ గా పనిచేసే అవకాశం దక్కింది.

# మీరు రోజూ తాగే టీ, కాఫీలలో వీటిని కలిపి తాగండి..




రోజూ చాలా మంది ఉదయం నిద్ర లేచినప్పటి నుంచి మళ్లీ రాత్రి నిద్రించే వరకు కూడా టీ లేదా కాఫీలను తెగ తాగేస్తుంటారు. అయితే టీ, కాఫీలను మోతాదులో తాగితే ఆరోగ్యకరమే అయినప్పటికీ వీటిని మరీ అతిగా సేవిస్తే మాత్రం ఆరోగ్యానికి హాని జరుగుతుంది. టీ, కాఫీలను అతిగా సేవించడం వల్ల అనేక అనర్థాలు సంభవిస్తాయి. అయితే ఇలా జరగకుండా టీ, కాఫీలను తాగాలంటే మీరు రోజూ తాగే వాటిలో పలు మసాలా దినుసులను కలుపుకోవాలి. ఇవి మన వంట ఇంట్లోనే ఉంటాయి. మనకు ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. మీరు రోజూ తాగే టీ లేదా కాఫీలలో ఈ మసాలా పదార్థాలను కలిపి తాగితే రుచికి రుచి లభించడంతోపాటు ఆరోగ్య ప్రయోజనాలను కూడా పొందవచ్చు. ఈ మసాలా పదార్థాలను టీ లేదా కాఫీలలో కలపడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు. ఆరోగ్యంగా కూడా సరిగ్గా ఉంటుంది.

అల్లం, దాల్చిన చెక్క..: మీరు రోజూ తాగే టీ లేదా కాఫీలో అల్లం కలిపి తాగండి. అల్లాన్ని వేసి అవి తయారు చేసి తాగండి. అల్లంలో యాంటీ మైక్రోబియల్, యాంటీ ఇన్ ఫ్లామేటరీ లక్షణాలు ఉంటాయి. ఇవి రోగాల నుంచి మనల్ని రక్షిస్తాయి. ముఖ్యంగా అల్లంలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. దీని వల్ల శరీరం ఇన్ఫెక్షన్లు, వ్యాధులకు వ్యతిరేకంగా పోరాడుతుంది. సీజనల్ వ్యాధుల నుంచి ఉపశమనం లభిస్తుంది. దాల్చిన చెక్కను కూడా టీ, కాఫీలలో కలిపి సేవించవచ్చు. దీన్ని మరిగించాల్సిన పనిలేదు. కాస్త పొడి వేసుకుని కలిపి తాగినా చాలు, ప్రయోజనం ఉంటుంది. దాల్చిన చెక్కలోనూ యాంటీ ఆక్సిడెంట్లు అధికంగానే ఉంటాయి. ఇవి రోగ నిరోధక వ్యవస్థ పనితీరును మెరుగు పరుస్తాయి. దీంతో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. దాల్చిన చెక్కలో యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు కూడా ఉంటాయి. ఇవి నొప్పులు, వాపులను తగ్గిస్తాయి. కనుక ఆర్థరైటిస్ నొప్పులు ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది.

పుదీనా ఆకులు..: పుదీనా ఆకులను కూడా టీ లేదా కాఫీలో వేసి మరిగించి తాగవచ్చు. పుదీనా ఆకుల్లో మెంథాల్ ఉంటుంది. ఇది రోగ నిరోధక వ్యవస్థకు దోహదం చేస్తుంది. వ్యాధులు రాకుండా మనల్ని రక్షిస్తుంది. పుదీనాను తీసుకుంటే జీర్ణక్రియ సైతం మెరుగు పడుతుంది.జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. అజీర్తి, గ్యాస్, కడుపు ఉబ్బరం నుంచి ఉపశమనంలభిస్తుంది. ఆయుర్వేద పరంగా తులసికి ఎంతో ప్రాధాన్యత ఉంది. తులసి ఆకుల్లో మన రోగ నిరోధక శక్తిని పెంచే గుణాలు ఉంటాయి. కనుక టీ లేదా కాఫీలో తులసి ఆకులను వేసి మరిగించి తాగవచ్చు. ఈ పానీయాలను సేవిస్తే రోగ నిరోధక శక్తి పెరిగి వ్యాధులు రాకుండా ఉంటాయి. అలాగే గులాబీ పువ్వుల రెక్కలతోనూ టీ, కాఫీ తయారు చేసి తాగవచ్చు. వీటిల్లో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. వ్యాధులు రాకుండా చూస్తాయి.

యాలకులు..: యాలకులతోనూ టీ లేదా కాఫీ తయారు చేసి తాగవచ్చు. ఈ పానీయాలు ఇలా చేస్తే ఎంతో రుచిగా ఉండడమే కాదు, ఆరోగ్య ప్రయోజనాలను కూడా అందిస్తాయి. యాలకుల్లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. వ్యాధులు రాకుండా రక్షిస్తాయి. అలాగే సోంపు గింజలను కూడా టీ లేదా కాఫీలో వేసి మరిగించి తీసుకోవచ్చు. వీటిల్లో యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఉంటాయి. ఇవి జీర్ణశక్తిని మెరుగు పరుస్తాయి. రోగ నిరోధక వ్యవస్థను పటిష్ఠంగా మారుస్తాయి. దీంతో ఇమ్యూనిటీ పెరుగుతుంది. రోగాల నుంచి రక్షణ లభిస్తుంది. ఇలా పలు రకాల మసాలా పదార్థాలను మీరు రోజూ తాగే టీ, కాఫీలలో వేసి మరిగించి తీసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. రోగాల నుంచి రక్షణ లభిస్తుంది. రోగ నిరోధక శక్తి సైతం పెరుగుతుంది.

# పురుషుల్లో శృంగార సామర్థ్యాన్ని పెంచే ఔషధం ఇది..



అరటి పండ్లు అంటే చాలా మందికి ఇష్టమే. ఈ పండ్లు మనకు ఏడాది పొడవునా అన్ని సీజన్లలోనూ అందుబాటులో ఉంటాయి. ఈ పండ్లను చాలా మంది ఇష్టంగా తింటారు. ధర కూడా తక్కువగానే ఉంటుంది. అరటి పండ్లలోనూ అనేక వెరైటీలు ఉంటాయి. అయితే కేవలం అరటి పండ్లే కాదు.. అరటి పువ్వు కూడా మనకు ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. అరటి పువ్వును కొందరు కూరగా వండుకుని తింటుంటారు. ఇది ఎంతో రుచిగా ఉంటుంది. అరటి పువ్వులో మన శరీరానికి కావల్సిన అనేక పోషకాలు ఉంటాయి. అరటి పువ్వును ఆహారంలో భాగం చేసుకుంటే అనేక ప్రయోజనాలను పొందవచ్చని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. అరటి పువ్వులో విటమిన్లు ఎ, సి, ఇ ఉంటాయి. పొటాషియం, క్యాల్షియం, మెగ్నిషియం, ఐరన్, జింక్ సమృద్ధిగా ఉంటాయి.

కంటి చూపు సమస్యకు..: అరటి పువ్వులో ఉండే విటమిన్ ఎ కంటి చూపును మెరుగు పరుస్తుంది. కళ్ల సమస్యలను తగ్గిస్తుంది. కళ్లలో శుక్లాలు రాకుండా చూస్తుంది. అలాగే రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. శరీరం వ్యాధులు, ఇన్‌ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాడుతుంది. చర్మాన్ని సంరక్షిస్తుంది. అరటి పువ్వులో ఉండే విటమిన్ సి రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. ఇన్‌ఫెక్షన్లు రాకుండా చూస్తుంది. ఈ పువ్వులో ఉండే విటమిన్ ఇ చర్మాన్ని రక్షిస్తుంది. చర్మంపై ఉండే ముడతలు, మచ్చలు పోతాయి. ముఖం కాంతివంతంగా మారి మెరుస్తుంది. యవ్వనంగా కనిపిస్తారు. అరటి పువ్వులోని విటమిన్ ఇ పురుషులకు ఎంతో మేలు చేస్తుంది. తరచూ అరటి పువ్వును తింటే పురుషుల్లో శృంగార సామర్థ్యం పెరుగుతుంది. శృంగారంలో చురుగ్గా పాల్గొంటారు. ఒత్తిడి, ఆందోళన, నీరసం, అలసట తగ్గుతాయి.

ఎముకల ఆరోగ్యానికి..: అరటి పండు కన్నా అరటి పువ్వులోనే పొటాషియం అధిక మొత్తంలో ఉంటుంది. ఇది రక్త సరఫరాను మెరుగు పరుస్తుంది. రక్త ప్రసరణ సరిగ్గా అయ్యేలా చేస్తుంది. దీంతో బీపీ తగ్గుతుంది. హైబీపీ నియంత్రణలో ఉంటుంది. బీపీ ఉన్నవారు తరచూ అరటి పువ్వును తింటుంటే ఎంతో మేలు జరుగుతుంది. అరటి పువ్వులో ఉండే క్యాల్షియం ఎముకలు, దంతాలను దృఢంగా, ఆరోగ్యంగా ఉంచుతుంది. ఈ పువ్వులోని మెగ్నిషియం కండరాల పనితీరుకు సహకరిస్తుంది. కండరాల నొప్పుల నుంచి ఉపశమనాన్ని అందిస్తుంది. రాత్రి పూట కాలి పిక్కలు పట్టుకుపోయే సమస్య ఉన్నవారు తరచూ అరటి పువ్వును తింటే మేలు జరుగుతుంది. అరటి పువ్వులో ఉండే ఐరన్ రక్తం తయారయ్యేలా చేస్తుంది. దీంతో రక్తహీనత తగ్గుతుంది. ఈ పువ్వులోని జింక్ రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. శిరోజాలు, గోర్లకు సంరక్షణను అందిస్తుంది.

జీర్ణ వ్యవస్థకు..: అరటి పువ్వులో క్వర్సెటిన్, కాటెకిన్ అనే యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి ఫ్రీ ర్యాడికల్స్ వల్ల శరీరానికి కలిగే నష్టాన్ని నివారిస్తాయి. దీంతో క్యాన్సర్, గుండె పోటు వంటి ప్రాణాంతక వ్యాధులురాకుండా అడ్డుకోవచ్చు. అరటి పువ్వులో ఉండే ఫైబర్ జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. అరటి పువ్వును తరచూ తింటే జీర్ణ క్రియ మెరుగు పడుతుంది. మలబద్దకం తగ్గుతుంది. ఈ పువ్వులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు షుగర్‌లెవల్స్‌నతగ్గిస్తాయి. టైప్ 2 దయాబెటిస్ ఉన్నవారు తరచూ ఈ పువ్వును కూరగా వండుకుని తింటే ఎంతో మేలు జరుగుతుంది. దీంతో దయాబెటిస్ నియంత్రణలో ఉం టుంది. అధిక కొలెస్ట్రాల్ ఉన్నవారికి కూడా ఈ పువ్వు ఎంతో మేలు చేస్తుంది. దీంతో రక్త నాళాల్లో ఉండేఅడ్డంకులుతొలగిపోతాయి. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. ఇలాఅరటి పువ్వుతోఅనేకలాభాలను పొందవచ్చు.

# వేసవిలో రోజూ తేనెను తింటే ఎన్ని లాభాలు కలుగుతాయో తెలుసా..?



అన్ని కాలాల్లాగే వేసవి కాలంలోనూ మనకు అనేక అనారోగ్య సమస్యలు వస్తుంటాయి. కారం, మసాలాలు అధికంగా ఉండే ఆహారాలను తినకూడదు. ఒక వేళ తింటే జీర్ణ సమస్యలు తలెత్తుతాయి. ముఖ్యంగా అసిడిటీ, కడుపులో మంట వస్తుంటాయి. ఇవే కాకుండా పలు ఇతర అనారోగ్య సమస్యలు కూడా మనకు వేసవిలోవస్తుంటాయి. అందువల్ల ఈ సీజన్‌కు తగినట్లుగా మనం ఆహారాలను తింటూ ఉండాలి. మనం తినే ఆహారాలు మన ఆరోగ్యాన్ని పరిరక్షించేవి కూడా అయి ఉండాలి. దీంతో ఓవైపు అనారోగ్య సమస్యలను తప్పించుకుంటూనే మరోవైపు పోషకాలను కూడా పొందవచ్చు. ఇక వేసవిలో తీసుకోవాల్సిన ఆహారాల్లో తేనె కూడా ఒకటి. వేసవిలో మన శరీరం సహజంగానే వేడికి గురవుతుంది. దీని బారి నుంచి తప్పించేందుకే కాక ఈ సీజన్‌లో తేనెను తీసుకోవడం వల్ల మనం అనేక ప్రయోజనాలను పొందవచ్చు.

చర్మ సంరక్షణ..: వేసవి కాలంలో రోజూ తేనెను ఒక టీస్పూన్ మోతాదులో తీసుకుంటే అనేక లాభాలను పొందవచ్చు. తేనె మన శరీరాన్ని చల్లబరుస్తుంది. ఒక గ్లాస్ నీటిలో కాస్త తేనె కలిపి తాగితే శరీరంలోని వేడి బయటకు పోయి శరీరం చల్లగా మారుతుంది. వేసవి తాపం నుంచి ఉపశమనం లభిస్తుంది. ఎండ దెబ్బ తగలకుండా జాగ్రత్త పడవచ్చు. డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉంటారు. ఉదయం ఈ నీళ్లను సేవిస్తే రోజంతా యాక్టివ్‌గా ఉంటారు. ఉత్సాహంగా పనిచేస్తారు. ఎంత పనిచేసినా అలసట రాదు. నీరసం కూడా ఉండదు. ఇక ఈ సీజన్‌లో మన శరీరం పొడిబారిపోతుంది. కొందరికి చర్మం ఈ సీజన్‌లోనే పగులుతుంది. అలాంటి వారు తేనెను తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది. తేనె చర్మానికి సహజసిద్ధమైన మాయిశ్చరైజర్‌లా పనిచేస్తుంది. దీంతో చర్మం ఎల్లప్పుడూ తేమగా ఉంటుంది. పొడిబారదు, పగలదు. తేనెతో ఫేస్ ప్యాక్‌లు కూడా వేసుకోవచ్చు. దీంతో ముఖం కాంతివంతంగా మారి యవ్వనంగా కనిపిస్తుంది. ముడతలు, మచ్చలు తగ్గిపోతాయి.

నిద్రలేమి..: రాత్రి పూట మీకు నిద్ర సరిగ్గా పట్టడం లేదా.. అయితే తేనెను తీసుకుంటూ ఉంటే ఈ సమస్య నుంచి బయట పడవచ్చు. తేనెలో ట్రిప్టోఫాన్ అనే అమైనో యాసిడ్ ఉంటుంది. అందువల్ల తేనెను తీసుకుంటే ఇది మన శరీరంలో సెరొటోనిన్, మెలటోనిన్‌గా మారుతుంది. ఇది నిద్రను ప్రోత్సహించే హార్మోన్. కనుక రాత్రి పూట తేనెను తీసుకుంటే మైండ్ రిలాక్స్ అయి చక్కగా నిద్ర వస్తుంది. పడుకున్న వెంటనే గాఢ నిద్రలోకి జారుకుంటారు. తేనెలో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్ గుణాలు ఉంటాయి. అందువల్ల తేనె మనల్ని బ్యాక్టీరియా, వైరస్‌ల నుంచి రక్షిస్తుంది. రోగ నిరోధక వ్యవస్థను పటిష్టంగా మారుస్తుంది. దీంతో శరీరం వ్యాధులకు వ్యతిరేకంగా పోరాడుతుంది. ఇన్ఫెక్షన్లు తగ్గేలా చేస్తుంది.

అధిక బరువుకు..: తేనెలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి శరీరాన్ని వాపులు, నొప్పుల నుంచి రక్షిస్తాయి. చర్మ కణాలు డ్యామేజ్ అవకుండా చూస్తాయి. దీంతో సూర్యుని నుంచి వచ్చే అతినీలలోహిత కిరణాల బారి నుంచి రక్షణ లభిస్తుంది. తేనె వల్ల శరీరం హైడ్రేటెడ్‌గా మారుతుంది. కోల్పోయిన ద్రవాను తిరిగి పొందుతుంది. వేసవిలో ఇది ఎంతో మేలు చేస్తుంది. శరీరం డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉంటుంది. ఎండ దెబ్బ తగలదు. అలాగే అధిక బరువును తగ్గించడంలోనూ తేనె అద్భుతంగా పనిచేస్తుంది. రోజూ ఉదయం పరగడుపునే గోరు వెచ్చని నీటిని ఒక గ్లాస్ తీసుకుని అందులో రాస్త తేనె వేసి కలిపి తాగుతుంటే శరీరంలోని కొవ్వు కరుగుతుంది. అధిక బరువు తగ్గుతారు. గొంతు సమస్యలు ఉన్నవారు తరచూ తేనెను తీసుకుంటుంటే సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది. ఇలా వేసవిలో తేనెను రోజూ తీసుకోవడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు.

# తక్షణ శక్తికి చెరకు రసం



కూల్‌డ్రింక్స్‌కి బదులు చెరకు రసం తాగితే ఎంతో మేలు. చెరకు రసం అలసట, నిస్సత్తువను తగ్గించి తక్షణ శక్తిని అందిస్తుంది. చెరకులో పిండిపదార్థాలు, ఫైబర్, పొటాషియం, జింక్, ఫాస్ఫరస్, క్యాల్షియం, ఐరన్ లాంటి మినరల్స్ పుష్కలంగా ఉంటాయి. విటమిన్-ఎ, బి, సి కూడా మెండుగా ఉంటాయి. దీంతో చెరుకు రసం క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల శరీరంలో ప్రొటీన్ స్థాయిలు పెరుగుతాయి. %-% మూత్రపిండాల ఆరోగ్యానికి కూడా మంచిది. అలాగే క్రమం తప్పకుండా చెరకు రసం తాగితే రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఇందులోని ఫ్లేవనాయిడ్స్, యాంటీఆక్సిడెంట్లు, ఇతర ఫెనోలిక్ కాంపౌడ్స్ వృద్ధాప్య ఛాయలు రాకుండా అడ్డుకుంటాయి.

చెరకు రసం కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించి గుండె ఆరోగ్యాన్ని కాపాడుతుంది.

ఎక్కువ వద్దు: అయితే కొంతమంది చెరకురసం ఆరోగ్యానికి మేలు చేస్తుందని.. ఎక్కువగా తాగుతారు. ఒకేసారి రెండు గ్లాసుల కంటే ఎక్కువ చెరకు రసం తాగితే.. ఆరోగ్యానికి హాని జరిగే ప్రమాదం ఉంది.చెరకు రసం అధికంగా తీసుకోవడం వల్ల విరేచనాలు, మలబద్ధకం, దయాబెటిస్ వచ్చే ప్రమాదం ఉంది. అలాగే 20 నిమిషాల కంటే ఎక్కువసేపు నిల్వ ఉంచింది తాగకూడదు. ఒకవేళ తాగితే శరీరానికి మంచిది కాదు. నిల్వ ఉన్న చెరుకురసం ఆక్సీకరణ చెంది, కడుపు నొప్పి, వాంతులు, కళ్లు తిరగడం వంటి సమస్యలకు కారణమవుతుంది. కాబట్టి తాజాగా చేసిన చెరకు రసం తాగడం మంచిది. చెరకు రసంలో పొలికోసనాల్ అధికంగా ఉంటాయి. పొలికోసనాల్ అధికంగా ఉండటం వల్ల నిద్రలేమి సమస్య వచ్చే అవకాశం ఉంది. ఈ సమస్య ముదిరితే..


మానసిక సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. చెరకు రసంలో కేలరీలు, చక్కెర పుష్కలంగా ఉంటాయి. ఇవి ఎక్కువగా తీసుకుంటే బరువు త్వరగా పెరుగుతారు. బరువును అదుపులో ఉంచుకోవాలంటే.. రోజుకు ఒక గ్లాసు చెరకు రసం మాత్రమే తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. చెరకులో ఉండే పోలికోసనాల్ రక్తాన్ని పలుచగా చేస్తాయి. దీని వల్ల రక్తం గడ్డకట్టదు.

# రోజూ కొబ్బరినూనెను తీసుకుంటే ఇన్ని లాభాలు ఉన్నాయా..?

కొబ్బరినూనెను చాలా మంది జుట్టు సంరక్షణ కోసం ఉపయోగిస్తుం టారు. కొబ్బరినూనె శిరోజాలకు ఎంతో మేలు చేస్తుంది. కొబ్బరినూ నెను రాయడం వల్ల జుట్టు మృదువుగా మారుతుంది. కాంతివంతంగా తయారవుతుంది. శిరోజాలు సహజసిద్ధమైన నిగారింపును సొంతం చేసుకుంటాయి. చుండ్రు తగ్గుతుంది. జుట్టు చివర్లు చిట్లిపోవడం నుంచి బయట పడవచ్చు. శిరోజాలకు చక్కని పోషణ లభించి ఒత్తుగా, దృఢంగా పెరుగుతాయి. అయితే వాస్తవానికి కొబ్బరినూనె మనకు కేవలం శిరోజాల సంరక్షణకే కాదు, పలు ఇతర ఆరోగ్య ప్రయోజనా లకు కూడా పనిచేస్తుంది. కొన్ని ప్రాంతాల వాసులు కొబ్బరినూనెను సేవిస్తుంటారు. కొబ్బరినూనెలో అనేక ఔషధ గుణాలు ఉంటాయి. కొబ్బరినూనెను ఆహారంలో భాగం చేసుకుంటే అనేక పోషకాలను పొందవచ్చు. పలు వ్యాధుల నుంచి బయట పడవచ్చు. అన్ని రకాల చర్మ

సమస్యలకు..: బాగా పండిన కొబ్బరి నుంచి నూనెను తీస్తారు. కొబ్బరికాయలు వాస్తవంగా చెప్పాలంటే పండ్ల జాతికి చెందుతాయి. కొబ్బరి నూనె చర్మాన్ని సహజసిద్ధంగా తేమగా మారుస్తుంది. మీరు రోజూ తినే ఆహారంలో ఒక టీస్పూన్ కొబ్బరినూ నెను చేర్చుకుంటే అనేక లాభాలు కలుగుతాయి. కోల్డ్ ప్రెస్డ్ విధానంలో తయారు చేసిన కొబ్బరినూనెలో పోషకాలు అధికంగా ఉంటాయి. రిఫైన్ చేయబడిన కొబ్బరినూనెను ఉపయోగించకూడదు. కొబ్బరినూనెలో యాంటీ ఆక్సిడెంట్లు, పాలిఫినాల్స్, విటమిన్ ఇ అధికంగా ఉంటాయి. ఈ నూనెలో మీడియం చెయిన్ ఫ్యాటీ యాసిడ్స్ ఉంటాయి. కొబ్బరినూనె యాంటీ ఇన్ ఫ్లామేటరీ, యాంటీ మైక్రోబియల్, యాంటీ ఫంగల్ గుణాలను కలిగి ఉంటుంది. అందువల్ల కొబ్బరినూనెను వాడితే అన్ని రకాల చర్మ సమస్యలు తగ్గుతాయి.

పోషకాలు అధికం..: శిరోజాల సంరక్షణకు కొబ్బరినూనె ఎంతో ఉపయోగపడుతుంది. కొబ్బరినూనెను వాడితే జుట్టుకు కలిగే నష్టాన్ని నివారించవచ్చు. దంతాలు, చిగుళ్ల సంరక్షణకు కూడా కొబ్బరినూనె పనిచేస్తుంది. 1 టేబుల్ స్పూన్ (11 గ్రాములు) కొబ్బరినూనె ద్వారా సుమారుగా 99 క్యాలరీల శక్తి లభిస్తుంది. 11 గ్రాములు కొవ్వు, 9.5




గ్రాముల శాచురేటెడ్ కొవ్వులు, 0.7 గ్రాముల మోనో అన్‌శాచు రేటెడ్ కొవ్వులు, 0.2 గ్రాముల పాలీ అన్‌శాచురేటెడ్ కొవ్వులు లభిస్తాయి. కొబ్బరినూనెలో ఉండే మీడియం చెయిన్ ఫ్యాటీ యాసిడ్లు యాంటీ ఇన్ ఫ్లామేటరీ, యాంటీ మైక్రోబియల్, యాంటీ ఫంగల్ గుణాలను కలిగి ఉంటాయి. అందువల్ల గజ్జి, తామర, సోరియాసిస్ వంటి చర్మ సమస్యలకు కొబ్బరినూనె అద్భుతంగా పనిచేస్తుంది.

గుండె ఆరోగ్యానికి..: రోజూ రాత్రి పూట నిద్రకు ముందు ఒక టీస్పూన్ కొబ్బరినూనెను సేవిస్తుండాలి. ఇది సహజసిద్ధమైన లాక్సేటివ్‌గా పనిచేస్తుంది. దీంతో మరుసటి రోజు సుఖ విరేచనం అవుతుంది. జీర్ణాశయంలో ఉండే వ్యర్థాలు, టాక్సిన్లు సులభంగా బయటకు పోతాయి. పెద్ద పేగు శుభ్రంగా మారుతుంది. మలబద్దకం తగ్గుతుంది. అలాగే కొబ్బరినూనెను తీసుకోవడం వల్ల జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. జీర్ణక్రియ సాఫీగా సాగుతుంది. గ్యాస్, కడుపు ఉబ్బరం, అసిడిటీ, అజీర్తి ఉండవు. కొబ్బరినూనెలో ఉండే అన్ శాచురేటెడ్ కొవ్వులు కొలెస్ట్రాల్‌ను తగ్గించేందుకు పనిచేస్తాయి.

# సినిమా..


## పుష్పలో షెకావత్ రోల్ భైరవం హీరోదా..?





లెక్కల మాస్టారు సుకుమార్ దర్శకత్వంలో రూపొందిన పాన్ ఇండియా చిత్రం పుష్ప. అల్లు అర్జున్, రష్మిక ప్రధాన పాత్రలలో ఈ చిత్రం రెండు భాగాలుగా రూపొందింది. రెండు భాగాలు కూడా మంచి విజయాలు సాధించాయి. అయితే ఇందులో నటించిన ప్రతి ఒక్కరికి మంచి గుర్తింపు లభించింది. ఇందులో అల్లు అర్జున్ పాత్ర ఎంత హైలెట్ అయిందో పోలీస్ ఆఫీసర్ భన్వర్‌సింగ్ షెకావత్ పాత్ర కూడా అంతే క్రేజ్ దక్కించుకుంది. 'పుష్ప' క్లైమాక్స్‌లో ఎంట్రీ ఇచ్చిన షెకావత్ 'పార్టీ లేదా పుష్పా' అంటూ ఒక్క డైలాగ్‌తో అశేష ప్రేక్షకాదరణ దక్కించుకున్నాడు. ఇక పుష్ప2లో షెకావత్ పాత్రని గట్టిగానే డిసైడ్ చేశాడు సుకుమార్. తనను అవమానించి బట్టలూడదీసాడని పుష్పపై ప్రతీకారంతో అనేక చేష్టలు చేశాడు. ఎర్రచందనం దుంగలు పట్టుకునే సీన్, షెకావత్‌కి పుష్ప సారీ చెప్పే సీన్, ఆ వెంటనే పుష్ప తిరిగొచ్చి కారుతో ఢీకొట్టి స్విమ్మింగ్‌పూల్‌లో మూత్రం పోసే సీన్, చివరికి పుష్ప చేతిలో ఓడిపోయి తనని తానే ఆత్మాహుతి చేసుకునే సీన్ ఇలా ప్రతీది కూడా ఆడియన్స్‌ని ఎంతగానో అలరించాయి. అయితే భన్వర్‌సింగ్ షెకావత్ పాత్రలో మలయాళ యాక్టర్ ఫహాద్ ఫాజిల్ నటించాడు. పాత్రలో పూర్తిగా ఒదిగిపోయి అలరించాడు. అయితే అసలు ఆ పాత్ర నారా రోహిత్ చేయాల్సిందట. 'భైరవం' ప్రమోషన్లతో బిజీగా ఉన్నా నారా రోహిత్ తాజాగా ఈ విషయాన్ని రివీల్ చేశారు. ' కరోనా టైమ్‌లో నేను మీసాలతో ఉన్న ఓ ఫోటోని నాకు పంపించిన నిర్మాత ఆ ఆ రోల్ గురించి చెప్పారు. అది నాకు కూడా నచ్చడంతో ఓకే అని చెప్పా. అయితే 'పుష్ప'ని పాన్ ఇండియా లెవల్‌లో తీస్తుండటంతో అన్ని భాషల నటులు ఉండాలని అనుకుని భన్వర్‌సింగ్ షెకావత్ రోల్‌కి ఫహాద్ ఫాజిల్‌ని తీసుకున్నారని చెప్పుకొచ్చారు నారా రోహిత్. షెకావత్ పాత్రలో నారా రోహిత్ చేసి ఉంటే ఆయన ఫేట్ మారి ఉండేదని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. భైరవం చిత్రంలో నారా రోహిత్‌తో పాటు బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మంచు మనోజ్ కూడా నటించారు. ఈ ముగ్గురికి మూవీ హిట్ కావడం ఎంతో అవసరం.

## మహేష్-రాజమౌళి సినిమాలో సరికొత్త టెక్నాలజీ..?





దిగ్గజ దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి, సూపర్ స్టార్ మహేశ్ బాబు కాంబోలో ఒక సినిమా తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. SSMB%29 అనే వర్కింగ్ టైటిల్‌తో రాబోతున్న ఈ ప్రాజెక్ట్‌ను దుర్గా ఆర్ట్స్ బ్యానర్‌పై కె.ఎల్. నారాయణ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. మహేశ్ - రాజమౌళి కాంబోలో ఫస్ట్ మూవీ కావడంతో భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్‌ని ఈ ఏడాది నవంబర్‌లో విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. గ్లోబ్ ట్రాటర్‌ని పరిచయం చేయబోతున్నట్లు తెలిపింది. అయితే ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం నుంచి ఒక సాలిడ్ వార్త ప్రస్తుతం వైరల్‌గా మారింది. ఈ సినిమాలో రాజమౌళి బ్లూ-స్క్రీన్ టెక్నాలజీని ఉపయోగించబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. మొదట ఈ సినిమా షూటింగ్‌ను కెన్యాలోని నేషనల్ పార్క్‌లలో చేయాలని చిత్రబృందం ప్లాన్ చేసుకున్న విషయం తెలిసిందే. ఇందుకోసం రాజమౌళి కూడా అక్కడి లోకేషన్‌లను జల్లెడ పట్టి వచ్చాడు. అయితే ప్రస్తుతం కెన్యాలో నెలకొన్న రాజకీయ ఉద్రిక్తతల కారణంగా ఈ ప్లాన్ మారినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం, రాజమౌళి కెన్యాకు బదులుగా టాంజానియాలోని సెరెంగెటి అడవుల్లో షూటింగ్ చేయాలని నిర్ణయించుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. మరోవైపు ఈ చిత్రంలో బ్లూ-స్క్రీన్ టెక్నాలజీని ఉపయోగించి ఆఫ్రికా అడవులను గ్రాఫిక్స్ ద్వారా రూపొందించబోతున్నట్లు సమాచారం. అయితే ఈ రెండు విషయాలపై చిత్రబృందం క్లారిటీ ఇవ్వాల్సి ఉంది.

## స్పిరిట్ ప్రాజెక్ట్ నుంచి తప్పకోవడం సరైనదేనా



అర్జున్ రెడ్డి సినిమాతో ఓవర్ నైట్ స్టార్ డైరెక్టర్ అనిపించుకున్న సందీప్ రెడ్డి వంగా అనూహ్యంగా వార్తల్లోకి వచ్చాడు. నిజానికి స్పిరిట్ సినిమా నుంచి దీపికా తప్పుకుందనే వార్త ముందు వెలుగులోకి వచ్చింది. దానికి దీపికా పెట్టిన కొన్ని కండిషన్స్ కారణమని కూడా అన్నారు. దీపికా పెట్టిన కండిషన్స్ నచ్చకపోవడంతో ఆమెను ప్రాజెక్టు నుంచి తప్పోమని కోరారని, దాంతో ఆమె వెళ్లిపోయిందని బయటకు తెలిసింది. అంతేకాదు, అనిమల్ సినిమాలో సెకండ్ హీరోయిన్ లాంటి పాత్రలో బోల్డ్ క్యారెక్టర్‌లో నటించిన తృప్తి డిమ్రీ స్పిరిట్‌లో హీరోయిన్ అంటూ సందీప్ రెడ్డి ప్రకటించాడు. అయితే అనూహ్యంగా ఈ వార్తలు వచ్చిన తర్వాత బాలీవుడ్‌లో స్పిరిట్ ఒక ఏ రేటెడ్ సినిమా అని, ఎక్కువగా బోల్డ్ సీన్స్, లిప్ లాక్‌లు ఉండడంతోనే దీపికా నటించలేనని బయటకు వచ్చిందని బాలీవుడ్ మీడియా పోర్టల్స్‌లో ప్రచారం మొదలైంది. దీంతో ఈ విషయం మీద ఫైర్ అవుతూ సందీప్ రెడ్డి ట్వీట్ చేశాడు. సినిమా కథ చెప్పి మిమ్మల్ని సినిమాలోకి ఆహ్వానించినప్పుడే ఒక సైన్ చేయని నాన్ డిస్‌క్లోజర్ అగ్రిమెంట్‌లోకి మీరు అడుగుపెట్టినట్లే, కానీ మీరు ఒక యంగ్ యాక్టర్‌ని నాశనం చేయాలనే ఉద్దేశంతో ఆ సినిమా కథ బయటికి చెప్తూన్నారని తెలిసింది. అక్కడే మీ క్యారెక్టర్ ఏంటో బయటపడుతుంది. ఇంకా ఈ ఫేక్ ఫెమినిజం ముసుగుతో ఏం చేయాలనుకుంటు న్నారు? సరే, ఈసారి కథ మొత్తం చెప్పండి, నాకు ఏమీ ఫరక్ పడదు అంటూ ఆయన రాసుకొచ్చాడు. అయితే నిజానికి దీపికా పడుకోనే గతంలో ఎప్పుడూ వివాదాల జోలికి వెళ్లలేదు. ఆమె పలువురు హీరోలతో డేటింగ్ చేస్తుందనే వార్తలు వచ్చినా సరే, వాటిని ఖండించలేదు సరికదా, తర్వాత ఒక స్టార్ హీరోని వివాహం చేసుకొని రిలేషన్‌లోకి అడుగు పెట్టింది. ఆమెను వెనకేసుకొస్తూ ఇప్పుడు బాలీవుడ్‌లో ఆర్టికల్స్ రావడంతో దాన్ని పిఆర్ స్టంట్ అంటూ సందీప్ రెడ్డి వంగాతో సహా చాలామంది అభివర్ణిస్తున్నారు. అయితే ఇక్కడ తప్పు ఎవరిది అనే ప్రస్తావన వస్తే, ఎవరిదీ అని కచ్చితంగా చెప్పలేని పరిస్థితి. ప్రాజెక్టు నుంచి బయటకు వచ్చిన వారు ఎవరూ సినిమా మీద ఇలాంటి విషపు ప్రచారాలు చేయించలేదు.

## వెంకటరమణ నేపథ్యమంతా విశాఖ!





విక్టరీ వెంకటేష్ కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో ఓ చిత్రానికి సన్నాహాలు జరుగుతోన్న సంగతి తెలిసిందే. వెంకీ-గురూజీ మార్క్ చిత్రంగా మలుస్తున్నారు. ఫ్యామిలీ ఆడియన్స్ లో వెంకటేష్ కున్న ఇ మేజ్ ఆధారంగానే త్రివిక్రమ్ ఫ్యామిలీ ఎంటర్ టైనింగ్ కథను రాసినట్లు వినిపిస్తుంది. 'వెంకటరమణ' అనే టైటిల్ కూడా ఫిక్సైందని సమాచారం. ఈ కథ పూర్తిగా విశాఖపట్టణం నేపథ్యంలోనే సాగుతుందిట. విశాఖలో దిగువ మధ్య తరగతి కుటుంబంలో పుట్టి పెరిగిన ఓ 50 ఏళ్ల వ్యక్తి కథగా ఆవిష్కరిస్తున్నారట. కుటుంబ అనుంబంధాల నేపథ్యానికి త్రివిక్రమ్ మార్క్ హాస్యాన్ని జోడించి సిద్ధం చేసిన స్క్రిప్ట్ అని తెలిసింది. విశాఖ-అనకాపల్లి ప్రాంతాలతో తనకున్న అనుబంధాన్ని గురూజీ ఈ కథలో హైలైట్ చేయబోయ బోతున్నారట. త్రివిక్రమ్ అంటే బలమైన డైలాగులు...బంధాలు.. భావోద్వేగంతో కథను నడిపించ గల దిట్ట. ఇలాంటి కథలు రాయడం కొట్టిన పిండి. 'అతడు', ' అత్తారింటికి దారేది', 'సన్నాఫ్ సత్యమూర్తి', 'అఆ', 'అరవింద సమేత', 'అల వైకుంఠపురములో' లాంటి చిత్రాల్లో ఎమోషన్ పాతతే అయినా తనదైన ట్రీట్ మెంట్ తో రక్తి కట్టించారు. వాటిలో హాస్యం అంతే పండుతుంది. అలాంటి డైరెక్టర్ కి వెంకీ లాంటి కామెడీ టింజ్ ఉన్న నటుడు తోడైతే? ఎమోషన్ తో పాటు, హాస్యానికి ఛాన్స్ ఉంటుంది. వెంకటరమణనిఈ పాయింట్ ఆధారం గానే రాసినట్లు సన్నిహితుల సమాచారం. ఇప్పటికే ఇద్దరి కాంబినేషన్ లో 'మల్లీశ్వరి', 'నువ్వు నాకు నచ్చావ్' లాంటి సినిమాలు తెరకెక్కిన సంగతి తెలిసిందే. అయితే ఈ రెండింటికీ డైరెక్టర్ వేరైనా రైటర్ గా పనిచేసింది త్రివిక్రమ్. వెంకీ శైలి..ఇమేజ్ ఆధారంగా తయారైన కథలవి. 'మల్లీశ్వరీ' కూడా వైజాగ్ నేపథ్యంలో సాగిన చిత్రమే.

## జైలర్ 2లో విలన్ టాలీవుడ్ స్టార్ హీరోనా..?



వరుస ఫ్లాపులతో సతమతం అవుతున్న సమయంలో జైలర్ చిత్రం రజనీకాంత్‌కి కాస్త ఉపశమనం అందించింది. ఈ చిత్రం బాక్సాఫీస్‌ని షేర్ చేసి సరికొత్త రికార్డులు క్రియేట్ చేసింది. ఇప్పుడు ఈ మూవీకి సీక్వెల్‌గా జైలర్ 2 రూపొందుతుంది. దర్శకుడు నెల్సన్ అభిమానుల అంచనాలను దృష్టిలో ఉంచుకొని మరింత ఆసక్తికరంగా రూపొందిస్తు న్నారు. రజనీకాంత్ ఇందులో పవర్ ఫుల్ క్యారెక్టర్ చేస్తుండగా, ఆయనతో తలపడే విలన్‌గా నాగార్జున నటించబోతున్నట్టు పలు వార్తలు నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి. ఇప్పటికే 'కూలీ' చిత్రంలో వీరిద్దరూ పోటాపోటీగా ఉండే పాత్రలను పోషిస్తున్నారు. జైలర్2 లో విలన్ పాత్ర కోసం కొన్ని పేర్లు పరిశీలించినా, నెల్సన్ దృష్టి నాగార్జునపైనే ఉంది. కూలీ చిత్రంలో సైమన్‌గా నాగార్జున అదరగొ ట్టడంతో జైలర్ 2లో నాగార్జుననే విలన్‌గా నటిస్తే బాగుంటుంది అని అనుకుంటున్నాడట. అందుకే ఇటీవల నాగార్జునను కలవడం, కథ, పాత్ర చెప్పడం జరిగిందట. అది నాగార్జునకి కూడా నచ్చడంతో ఆయన సైతం గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశారని తెలుస్తోంది. 'జైలర్ 2' చిత్రానికి సంబంధించి ఇప్పటికి రెండు షెడ్యూల్స్ పూర్తవగా%ౌ% మూడో షెడ్యూల్ త్వరలో ప్రారంభం కానుంది. ఈ షెడ్యూల్‌లోనే రజనీకాంత్ , నాగార్జున భారీ యాక్షన్ ఎపిసోడ్ చిత్రీకరించనున్నట్టు సమాచారం. మరోవైపు జైలర్ 2లో నందమూరి బాలకృష్ణ కూడా కీలక పాత్ర పోషించనున్నాడట. పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా ఆయన కనిపించనున్నారని అంటున్నారు. జైలర్‌లోనే శివరాజ్ కుమార్ పాత్రలో బాలయ్య నటించాల్సి ఉన్నప్పటికీ అది మిస్ కాగా, ఈ సారి మాత్రం బాలకృష్ణని ప్రత్యేక పవర్ ఫుల్ పాత్రలో చూపించబోతున్నాడట నెల్సన్. ఈ వార్తలు నిజమైతే మాత్రం జైలర్ 2 ప్రభంజనం సృష్టించడం ఖాయం. టాలీవుడ్ అగ్రతారలుగా ఉన్న బాలకృష్ణ, నాగార్జునలు ఇంతవరకూ ఒక్క సినిమాలో కూడా కలసి నటించింది లేదు.

## కారంగా ఉంటుందని పచ్చిమిర్చిని పక్కన పెట్టేస్తున్నారా..



ఒకప్పుడు మన పూర్వీకులతోపాటు పెద్దలు కూడా పచ్చి మిర్చిని రోజూ తినేవారు. దీన్ని వారు తమ రోజువారి ఆహారంలో భాగం చేసుకునేవారు. చద్దన్నంలో పచ్చి మిర్చిని నంజుకుని తినేవారు. అయితే పచ్చి మిర్చి వల్ల కలిగే లాభాలు తెలిస్తే ఎవరైనా దీన్ని ఇష్టంగా తింటారు. ఒకప్పుడు మన పూర్వీకులు వీటిని రోజూ తినేవారు. అందుకనే వారు ఎంత వయస్సు వచ్చినా ఆరోగ్యంగా ఉండేవారు. ఈ క్రమంలోనే పచ్చి మిర్చిని ఆహారంలో భాగం చేసుకుంటే అనేక లాభాలు పొందవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. పచ్చి మిర్చి కారంగా ఉంటుందని చాలా మంది తినేందుకు ఆసక్తిని చూపించరు. కూరల్లో వచ్చినా పడేస్తుంటారు. కానీ పచ్చి మిర్చిలో మన శరీరానికికావల్సిన అనేక పోషకాలు ఉంటాయి. ఇవి మనల్ని ఆరోగ్యంగాఉంచుతాయి. పచ్చి మిర్చిలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. నారింజ పండ్లలో కన్నా పచ్చి మిర్చిలోనే అధికంగా విటమి న్‌సిఉంటుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. కనుక పచ్చిమిర్చిని ఆహారంలో భాగం చేసుకుంటే రోగ నిరోధక శక్తి పెరుగు తుంది. దీంతో శరీరం వ్యాధులు, ఇన్ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాడు తుంది. రోగాలు రాకుండా చూస్తుంది. పచ్చి మిర్చిలో బీటా కెరోటిన్ అధికంగా ఉంటుంది. ఇది మన శరీరంలో విటమిన్‌ఎ గా మారుతుంది. దీంతో కంటి చూపు మెరుగు పడుతుంది. కళ్ల సమస్యలు తగ్గిపోతాయి. వృద్ధాప్యంలో వచ్చే శుక్లాలు రాకుండా అడ్డుకోవచ్చు. పచ్చి మిర్చిలో విటమిన్ బి6, బి9 అధికంగా ఉంటాయి. ఇవి మన శరీర మెటబాలిజంను మెరుగు పరుస్తాయి. దీంతో క్యాలరీలు ఖర్చువుతాయి. కొవ్వు కరిగి అధిక బరువు తగ్గుతారు. ఈ విటమిన్ల వల్ల నాడీ మండల వ్యవస్థ ఆరోగ్యం మెరుగు పడుతుంది.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. rni. no: TELTEL/2023/88215